ఈనాడు
వికారాబాద్
గురువారం 17 ఆగస్టు 2017 16 పేజీలు

ఫొటో తీయండి... వాట్సప్ చేయండి

న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్

మీకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టమా.. మంచి దృశ్యాలు కనిపించగానే కెమెరాలో బంధిస్తారా.. మానవీయం ప్రతిబింబించే ఛాయాచిత్రాలనూ తీయగలరా. ప్రకృతి రమణీయతను దృశ్యరూపంలో చూపగలరా... అలాగైతే మీ కెమెరాలో బంధించిన చిత్రాలను మాకు వాట్సప్ చేయండి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈనెల 19న మీరు తీసిన ఫొటోలను 'ఈనాడు'లో ప్రచురిస్తాం. మీరు తీసిన ఛాయాచిత్రంతోపాటు మీ పాస్‌పోర్టు సైజు ఫొటోను సైతం పంపండి. మానవీయం, ఆహ్లాదం, ఆకట్టుకునేలా ఉండే వాటికే ప్రాధాన్యం ఉంటుంది. ఎంపిక, ప్రచురణలో తుది నిర్ణయం మాదే. ఇంకెందుకు ఆలస్యం కెమెరాకు పనిచెప్పండి. ఫొటోలు వాట్సప్‌లో పంపండి. మీ పేరు, చిరునామా జతచేయండి.



ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్లు: 8008573279, 8008550381

ఎప్పటిలోగా పంపాలంటే: ఆగస్టు 18 (శుక్రవారం) మధ్యాహ్నం 2 గంటల్లోపు

వారి రూటే సెపరేటు

- బొంరాస్‌పేటకు చెందిన పొట్ట గోపాల్, మల్లేశం అనే ఇద్దరికి రెండు యూనిట్లలో 42 గొర్రెలు అందించారు. అందులో అయిదు నెలల లోపు వయసున్నవి 15 గొర్రె పిల్లలు ఉండటం గమనార్హం. మరో అయిదు గొర్రెలకు వయస్సు మీదపడి దంతాలు సైతం ఊడిపోయాయి. అవి మేత మేయడానికి కూడా ఇబ్బంది పడుతున్నాయి. అవి మళ్లీ పిల్లలను కనే అవకాశాలే లేవంటూ లబ్ధిదారులు వాపోతున్నారు.
- బొంరాస్‌పేటకు చెందిన అగతి అంజిలయ్య అనే లబ్ధిదారుకు మూడు పొట్టేళ్లు, 18 గొర్రెలను అందజేశారు. అందులో అయిదు నెలలలోపు చిన్నపిల్లలు మూడు ఉన్నాయి. బురుజు యాదయ్యకు రెండు పొట్టేళ్లు, 19 గొర్రెలు ఇచ్చారు. వాటిలో అయిదు చిన్నపిల్లలు ఉన్నాయి. పునరుత్పత్తికోసం అందించిన పొట్టేళ్లు రెండూ ఇప్పటికీ తల్లి పాలు తాగుతున్నాయి. బాపురం మల్లయ్యకు అందించిన గొర్రెల్లో అయిదు చిన్నపిల్లలు ఉండగా వాటిలో రెండు చనిపోయాయి. వీటికి సంబంధించిన బీమా పరిహారం డబ్బులు కూడా రాలేదు.
- బొంరాస్‌పేటకే చెందిన మాటూరి కేశవులుకు అందించిన గొర్రెల యూనిట్‌లో ఒకటి కాకుండా మూడు పొట్టేళ్లను ఇచ్చారు. అలాగే మూడు చిన్నపిల్లలు, ఆరు పళ్లు ఊడిపోయిన పెద్ద వయస్సు గొర్రెలను ఇవ్వడంతో ఆయన ఆందోళన చెందుతున్నారు.



పాలు తాగుతున్న పొట్టేలు పిల్ల



ఈ తల్లీపిల్లలు రెండింటికీ ఒకే ధర చెల్లించారు

- **జీవాల పంపిణీలో దళారుల దందా**
- **అయిదు నెలలలోపు పిల్లల అందజేత**
- **లబోదిబోమంటున్న లబ్ధిదారులు**

వికారాబాద్:
న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

అధికారులకు లక్ష్యాలను చేరుకోవాలన్న తపన... లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించే యూనిట్లు పొందాలన్న ఆతృత... అమ్ముతున్న వారికి చేతికి నాలుగు పైసలు ఎక్కువ గిట్టుబాటవుతున్నాయన్న ఆనందం... వెరసి దళారుల చేతిలో దారుణంగా మోసపోతున్నారు. కులవృత్తిదారులను ప్రోత్సహించి, వారి ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవాలను పంపిణీ చేస్తుండగా... నిధులు ఖర్చువుతున్నాయే తప్ప లక్ష్యం నెరవేరడంలేదు. గొర్రెల యూనిట్ల పంపిణీలో నీలి మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఫలితంగా జీవాల్లో జీవం లేకుండా పోతోందని లబ్ధిదారులు నిట్టూర్చుతున్నారు. జిల్లాలో గొర్రెల యూనిట్ల పంపిణీ తీరును 'ఈనాడు' పరిశీలించగా ఆందోళన కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇవీ వివరాలు...

గొల్ల, కుర్మలకు లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం గొర్రెల యూనిట్లను అందిస్తోంది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది మొత్తం 10 వేలకుపైగా యూనిట్లు అందజేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. వీటిని పక్క రాష్ట్రం నుంచి కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమై ఉన్నారు. పశు వైద్యులకు గొర్రెల యూనిట్ల ఎంపిక, పంపిణీ బాధ్యతలు అప్పగించడంతో ఇటు విధులకు హాజరు కాలేక, అటు కర్ణాటక వెళ్లి గొర్రెలు వెతకలేక నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.1.25 లక్షలుగా నిర్ధారించగా ఇందులో డబ్బులకు తగిన జీవాలు దొరకడం లేదని స్పష్టమవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం ఎనిమిది నెలల నుంచి రెండేళ్ల వయసు ఉన్న గొర్రెలను మాత్రమే కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించాలి. అయితే ప్రస్తుతం రెండు నెలల నుంచి మూడేళ్ల వయసు ఉన్న గొర్రెలను సైతం **మిగతా 7 లో...**

అనంతగిరిలో ఆయుష్ ఆసుపత్రి

రూ.6 కోట్లు మంజూరు



ఆయుష్ సంచాలకులు రాజేందర్‌రెడ్డి, అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.కె.ఝూలాతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న పాలనాధికారిణి దివ్య

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: అనంతగిరిలో ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు ప్రభుత్వం రూ.6 కోట్లను మంజూరు చేసినట్లు జిల్లా పాలనాధికారిణి దివ్య తెలిపారు. బుధవారం అనంతగిరి అటవీ ప్రాంతంలో ఆసుపత్రి ఏర్పాటుతోపాటు టూరిజం, అభివృద్ధికి ఎంపిక చేయాల్సిన స్థలాన్ని ఆయుష్ సంచాలకులు రాజేందర్‌రెడ్డి, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పి.కె.ఝూలాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనంతగిరిలో 50 పడకలతో **మిగతా 7 లో...**

కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రాధాన్యం



లబ్ధిదారురాలికి చెక్కు అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఉపపాలనాధికారి సందీప్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షురాలు సునీత తదితరులు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం రాత్రి రవాణా శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్థికసాయం చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం '450 మంది... రూ.3.37 కోట్లు... నిలిచిన చెల్లింపులు' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, కోట్‌పల్లి మండలాలతోపాటు తాండూరు పురపాలక సంఘానికి చెందిన చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెల్లించాల్సిన ఆర్థిక సాయానికి సంబంధించి ఒక్కొక్కరికి రూ.75,116ల చొప్పున చెక్కులను వెంటనే సిద్ధం చేశారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం రాత్రి మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయించారు. నియోజకవర్గానికి చెందిన మండలాలతోపాటు పట్టణానికి చెందిన కొందరికి మంత్రి అందజేయగా... మిగిలిన వారు గురువారం నుంచి ఉపపాలనాధికారి సందీప్‌కుమార్ ద్వారా పొందాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.51 వేలు సరిపోవడం లేదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సాయాన్ని రూ.75,116లకు పెంచారన్నారు. పేద కుటుంబాల యువతులకు వివాహాలు చేసేందుకు వారి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదల అభ్యున్నతి లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. గొల్ల, కురుమలకు జీవాలను రాయితీపై అందజేస్తుండగా బషీరాబాద్ మండలంలో ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మిగిలిన మండలాల్లోనూ త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. బెస్తలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో చెరువుల్లో **మిగతా 7 లో...**

ఈనాడు కథనానికి స్పందన

తట్టును తరిమేద్దాం.. పొంగును పారదోలుదాం!

- జిల్లాలో నేటి నుంచే టీకాలు
- 2.56 లక్షల పిల్లలకు లబ్ధి



పట్టణలో నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్

చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమం నేటి నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. వైద్యారోగ్య శాఖ కసరత్తు పూర్తి చేసింది. 9 నెలల నుంచి 12 నెలల వయస్సు ఉన్న చిన్నారులకు తట్టు (మీజిల్స్) రాకుండా డోస్-1 టీకా వేసేవారు. 16 నెలల నుంచి 24 నెల మధ్యలో రెండో దఫా వేసేవారు. ఇప్పటికీ పొంగు వ్యాధి రాకుండా(రుబెల్లా) టీకా ప్రభుత్వం ఆసుపత్రుల్లో లేదు. దీంతో కొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో తమ చిన్నారులకు వేయించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రెంటికీ కలిపి ఒకే టీకా(ఎంఆర్) **మిగతా 7 లో...**



రోడ్డుపై పరిచిన కంకర



రోడ్డుపై ఆగిన ఆటో...

ఈ రోడ్డుపై ప్రయాణించగలరా..!

కంకరపోసి వదిలేయడంతో పెరుగుతున్న ప్రమాదాలు

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి కోస్గి వరకు రెండు వరుసల తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కానీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి చెల్లాపూర్ వరకు సుమారుగా 6 కిలో మీటర్ల వరకు రోడ్డుపై కంకర వేయడంతో ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలకు వీలుకాక కిందపడుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర గాయాల పాలవుతున్నారు. రోడ్డుపై కంకర పోయడంతో వాహనాలు వెళ్తే దుమ్ము లేస్తుందన్నారు. దీంతో దుమ్ము కళ్లల్లో పడి పలుసార్లు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలయ్యారని కొందరు స్థానికులు తెలిపారు. రోడ్డుపై కుటుంబ సభ్యులతో వెళ్తే ఆసుపత్రి పాలు కావడం ఖాయమన్నారు. రోడ్డుపై కంకర పరిచి ద్విచక్ర వాహనచోదకులకు కనీసం ప్రత్యామ్నాయ రహదారి కూడా ఏర్పాటు చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో గుత్తేదారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

బషీరాబాద్, న్యూస్‌టుడే: దాడి చేసి కొట్టిన ఇద్దరిపై కేసు నమోదైంది. బషీరాబాద్ ఎస్ఐ షరీపుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం నవాంద్గీ గ్రామానికి చెందిన అశోక్ ప్రేమ వ్యవహారంతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మీ వల్లే మా తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నాడనే కోపంతో మృతుడి అన్న రవీందర్, అక్క శాంతమ్మ ఇరువురు కలిసి అమ్మాయి తండ్రి శాణప్పపై దాడి చేసి కొట్టారు. దీంతో శాణప్ప తలకు రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు తెలిపారు. హరితహారంలో భాగంగా బుధవారం సుచిత్రా అకాడమీలో ఆమె జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ మొక్కల పెంపకంపై విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. క్రీడలపైనా ఆసక్తి పెంపొందిస్తే క్రీడల్లో రాణించటానికి వీలుకలుగుతుందన్నారు. క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు ఆత్మస్థైర్యం కూడ పెంపొందే అవకాశాలుంటాయన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలో హరితహారం కార్యక్రమంతో పాటు స్వచ్ఛభారత్‌కు తగు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించేందుకు కరచాలనానికి బదులు స్వచ్ఛ నమస్కార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శంకరయ్య, కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ సుధాంష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై సర్వే



మర్పల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

మర్పల్లి న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అధికారులు సర్వే నిర్వహించారు. బుధవారం మర్పల్లిలో ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న ఇళ్ల వివరాలను పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఇళ్ళు నిర్మించుకున్న వారికి బిల్లులు ఎంతవరకు అందాయని, నిర్మించుకున్న వారికి ఇంకా బిల్లులు అందాయా, అనే అంశాలను నిర్మాణంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తామని వారు పేర్కొన్నారు. ఆయనవెంట వీఆర్వో ప్రియాంక తదితరలు ఉన్నారు.

వినియోగంలో వెలుగులు.. చెల్లింపుల్లో చీకట్లు...!



✷ జిల్లాలో రూ. 105 కోట్ల విద్యుత్తు బిల్లు బకాయిలు
✷ వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం

న్యూస్‌టుడే, వికారాబాద్:

★ మంగళవారం తాండూరు మార్కెట్ కమిటీకి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కారణం బిల్లు బకాయిలు చెల్లించలేదు.

★ ఇటీవలి కాలంలో ఓ మండల అభివృద్ధి కార్యాలయానికి విద్యుత్తు బిల్లు చెల్లించలేదని సరఫరా నిలిపివేశారు. రెండు రోజుల అనంతరం కలెక్టర్ ప్రత్యేక చొరవతో తిరిగి పునరుద్ధరణ చేశారు.

★ గతంలో వికారాబాద్, తాండూరు పురపాలక సంఘాలకు, పంచాయతీరాజ్, అటవీ శాఖ, రహదారులు, భవనాలు, తదితర శాఖల కార్యాలయాలకు, జిల్లాలోని కొన్ని పంచాయతీ కార్యాలయాలకు విద్యుత్తు బిల్లులు చెల్లించలేదని సరఫరా నిలిపివేసిన సంఘటనలు ఉన్నాయి.

ప్రతి ఇంట్లో టీవీ కనెక్షన్ ఉంటుంది. నెలకు కనీసం రూ. 150 కేబుల్ బిల్లు చెల్లిస్తున్నారు. మోటారు సైకిళ్లపై స్వారీలు, కూలీ చేసుకున్న వారు సైతం సాయంత్రమైతే మద్యం ముట్టుకోకుండా ఉండటం లేదు. కానీ వినియోగించుకుంటున్న విద్యుత్తు బిల్లులు చెల్లించాలంటే చాలా మందికి కష్టమై పోతోంది అంటూ విద్యుత్తు శాఖకు చెందిన ఓ అధికారి తన ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలు

ప్రస్తుతం జిల్లాలో మరో మారు ముప్పేట దాడులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్తు బిల్లుల ఎగవేతదారులకు ఇక చెక్ చెప్పడానికి శాఖాధికారులు సన్నద్ధమయ్యారు. దీనికి సంబంధించి బకాయిదారుల జాబితాలు సిద్ధం చేశారు. బిల్లు బకాయిలు చెల్లిస్తే సరేసరి లేదంటే కనెక్షన్ తొలగించడం, అదీ కాదంటే పూర్తిగా మీటరునే తిరిగి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు, గృహ వినియోగదారులనే తేడా లేకుండా అన్ని రకాల కనెక్షన్లను ఒకేరకంగా వ్యవహరించాలని, అత్యవసర సేవలకు మినహాయింపు ఇవ్వాలని నిశ్చయించారు. దీంతో గత రెండు రోజులుగా జిల్లాలో డివిజన్ల వారిగా ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయి.

మొత్తం 1.87 లక్షల గృహ వినియోగ మీటర్లు

జిల్లాలో మొత్తం 1.87 లక్షల గృహ వినియోగ విద్యుత్తు మీటర్లు, 57 వేల వ్యవసాయ కనెక్షన్లు, 16 వేల వాణిజ్య, 2,300 వరకు పరిశ్రమలకు చెందిన కనెక్షన్లు ఉన్నాయి. మీటర్ల కోసం 1,100 దరఖాస్తులు కార్యాలయాల్లో ఉన్నాయి. జిల్లా అవసరాలకు రోజుకు సుమారు 130 మెగావాట్ల విద్యుత్తు అవసరం అవుతోంది. ఇది వేసవి సీజన్‌లో అయితే సుమారు 210 మెగావాట్ల వరకు వినియోగిస్తున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గృహ వినియోగదారులకు సంబంధించి యూనిట్ల వినియోగాన్ని బట్టి శ్లాబుల వారీగా బిల్లులు ఉంటాయి. పంచాయతీల్లో వీధి దీపాలు, తాగునీటి ట్యాంకులకు సంబంధించి మోటార్లకు విద్యుత్తు కనెక్షన్లు నడుస్తున్నాయి. ఇందులో జిల్లాలోని సుమారు 970 వరకు ఆవాసాలు ఉన్నాయి. వీటికి సంబంధించి జిల్లాలో సుమారు రూ.100 కోట్ల వరకు బిల్లు బకాయిలు ఉన్నాయని గుర్తించారు. వికారాబాద్ పురపాలక సంఘం రూ.3.5 కోట్లు, తాండూరు పురపాలక సంఘం రూ. 94 లక్షలు, వ్యవసాయ బోర్లకు సంబంధించి రూ.13 కోట్ల బిల్లులు అపరిష్కృతంగా ఉన్నాయి. వ్యవసాయ బోర్లకు సంబంధించి బిల్లు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తున్నప్పటికి వినియోగదారుని రుసుము కింద రైతు నెలకు రూ.30 చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్తు శాఖాధికారులు పేర్కొంటున్నారు. వీటిని చెల్లించడానికి కొందరు రైతులు ముందుకొచ్చినా, ఎక్కువ మంది నిరాకరిస్తున్నారని సమాచారం.

ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాం

–దుర్గారావు, విద్యుత్తు శాఖ డీఈ, వికారాబాద్

జిల్లాలో బకాయిల వసూలుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాం. ఇప్పటికే అందరికీ నోటీసులు అందించాం. వినియోగదారులు స్పందించి బిల్లులు చెల్లిస్తే సరేసరి. లేదంటే కనెక్షన్ తొలగిస్తాం. రూ.100 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. ఇవి వస్తే ఇంకా మెరుగైన సేవలందించేందుకు అవకాశం ఉంటుంది.

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	76–00	78–00
రిటైల్	90–00	93–00
డ్రెస్డ్	126–00	135–00
స్కిన్‌లెస్	149–00	158–00

వెన్‌కాబ్: 9849219870
సుగుణ: 9346589121

వర్షంతో పంటలకు జీవం

పరిగి, న్యూస్‌టుడే: పరిగి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పంటలు ఎండిపోతున్న సమయంలో కురిసిన వర్షం జీవం పోసినట్లయింది. కోట్లాది రూపాయల విలువైన వర్షంగా రైతులు భావిస్తున్నారు. మొక్కజొన్న పైరు చాలా వరకు పూత, కండె దశలో ఉంది. గత వారం రోజులుగా పైరు పూర్తిగా వాడిపోతోంది. సరిగ్గా ఇదే సమయంలో కురిసిన వర్షంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇలాంటి వర్షాలు మరో వారం రోజుల పాటు కురిస్తే మొక్కజొన్న చేతికందుతుందని అంటున్నారు.



తాండూరులో రోడ్డు మీద నిలిచిన వర్షం నీరు

తాండూరు పట్టణం న్యూస్‌టుడే: తాండూరులో గత రెండు, మూడ్రోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో రోడ్ల మీద వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో స్థానికులు దారుల్లో నడవటానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోడ్ల మీద పడిన గుంతల్లో వాన నీరు నిలవడంతో వాహనాదారులు వెళ్లటానికి ఆందోళన చెందుతున్నారు. అధికారులు రోడ్లపై పడిన గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. రోజు వర్షం కురుస్తుండటంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పరిగిలో కురుస్తున్న వర్షం

సంకేతం అందదు... సిమ్ చిలక పలకదు!

ఈ పాస్‌తో ఇబ్బందులు.. ● రేషన్ దుకాణాల్లో సరకుల కోసం తప్పని పరేషాన్



గ్రామాల్లో అలంకారప్రాయంగా సెల్ టవర్స్

న్యూస్‌టుడే, కొడంగల్

రేషన్ సరకులు లబ్ధిదారులకు పంపిణీ చేయాలంటే సెల్ సిగ్నల్స్ (సంకేతం) తప్పని సరి. గతంలో రేషన్ దుకాణాలు తెరిస్తేచాలు. తమకు కావాల్సిన సరకులను ఆ డీలర్‌తో చెప్పి తీసుకొని వెళ్లేవారు. నేడు ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఈ పాస్ విధానంతో అన్‌లైన్ అనుసంధానం అయిన తరువాతనే రేషన్ సరకులు అందించే పరిస్థితి వచ్చింది. గతంలో రేషన్ దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్తగా ప్రభుత్వ ఈ పాస్ విధానాన్ని గత జూలై నెల నుంచి అమలులోకి తీసుకొని వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 2,34,544 మంది రేషన్ లబ్ధిదారులుండగా 593 రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా 5,402 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. గతంలో అయితే స్థానికులు వలస వెళ్లడం ఇతర కారణాలతో స్థానికంగా లేక పోవడం, వారు వచ్చిన తరువాత తీసుకోవడం లేదా వారి బంధువులకు ఇవ్వడం జరిగేది. అలాగే బియ్యం బాగా లేకపోతే వాటిని అమ్ముకొని కొత్త బియ్యం తీసుకోవడం వంటి పనులు చేసుకొనే వారు. ఇందులో కొంత వరకు లబ్ధిదారులు రాకపోతే డీలర్లతో పాటు పలువురు అక్రమంగా దోచేసేవారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పాస్ విధానం బాగానే ఉన్నా పలు సాంకేతిక సమస్యలతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.


ఇంటర్‌నెట్, కరెంటు సమస్యలతో ఇక్కట్లు..

రేషన్ బియ్యం అందించాలంటే ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా బియ్యం తూకం చేసి అందించాలి. కనీసం 50 గ్రాముల బియ్యం తక్కువగా ఉన్నా ఈ పాస్ పనిచేయదు. దీంతో సరిగ్గా తూకం చేస్తేనే బియ్యం లెక్కను ఎలక్ట్రానిక్ కాంటాలు చూపిస్తాయి. రేషన్ దుకాణాలకు లబ్ధిదారులు వచ్చిన సమయంలో కరెంటు లేకున్నా, ఇంటర్ నెట్ పనిచేయకపోయినా కాంటాలు పని చేయక లబ్ధిదారులు రోజంతా నిరీక్షించక తప్పదు. ఇలాంటి సమస్యలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి.

మూడు నెలలు తీసుకోకుంటే కార్డు ఉండదు

వలసవ వెళ్లిన వారు, సెల్ టవర్స్ సిగ్నల్ అందక విసుగొచ్చి వెళ్లిపోయిన వారు ఇలా పలు సమస్యలతో రేషన్ సరకులు మూడు నెలలు వరుసగా తీసకోకుంటే రేషన్‌కార్డులు తొలగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే ఎంతో మంది పేద ప్రజలకు ఆన్యాయం జరుగుతుందని ప్రభుత్వ ఇలాంటి అంశాలపై మరోసారి పరిశీలించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చినా...



ఉండీ పనిచేయని సెల్‌ఫోన్, మిషన్లు

ప్రభుత్వం నుంచి రేషన్ దుకాణాలకు సిమ్‌కార్డులను అందజేశారు. ఈ సిమ్‌కార్డు ద్వారా ఇంటర్‌నెట్ కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. దీంతో తూకం యంత్రం పనిచేస్తుంది. అయితే కొన్ని గ్రామాల్లో సెల్ టవర్స్ లేకపోవడం, మరి కొన్ని గ్రామల్లో ఐడియా కాకుండా ఇతర సెల్ టవర్స్ ఉండటం, మరి కొన్ని గ్రామాల్లో ఏ ఒక్క సిమ్‌కార్డులు పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాలను పరిశీలిస్తే వాస్తవాలు ఈ విధంగా ఉన్నాయి.

● కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్, చిన్ననందిగామ, ప్యాలమద్ది, కస్తూర్‌పల్లి గ్రామాల్లో ఏ ఒక్క సెల్‌టవర్ సిగ్నల్ పనిచేయడంలేదు. దీంతో ఈ గ్రామాల లబ్ధిదారులను ఇతర గ్రామాలకు అనుసంధానం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఐడియా సెల్‌టవర్స్ పనిచేయడంలేదు.

● తాండూరు నియోజకవర్గంలో 113 రేషన్ దుకాణాల్లో ఉద్దండపూర్, సంగాయిపల్లి, గుంతబాస్‌పల్లిలతో పాటు మరి కొన్ని గ్రామాలు ఉన్నాయి.

● పరిగి మండలంలో మొత్తం 41 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో బాస్పల్లి, సయ్యదిపల్లి, ఇబ్రహీంపూర్‌లతోపాటు మరికొన్ని దుకాణాలు, అలాగే బొంరాస్‌పేట మండలంలో మొత్తం 29 రేషన్ దుకాణాల్లో సెల్ టవర్ల సమస్య తీవ్రంగా ఉంది.

మిగులుతున్న బియ్యం

ఈ పాస్ పద్ధతి అమలులోకి రాకముందు జూన్ నెల మిగులు బియ్యం నిల్వలు 16 టన్నులు ఉండగా, గత నెలలో 386 టన్నుల బియ్యం మిగిలాయి. ఇందులో సెల్ సిగ్నల్స్ పనిచేయకపోవడం, దూర ప్రాంతాలలో ఉన్నవారు రాకపోవడం వంటి కారణాలతో గత నెల నుంచి ఈనెల వరకు బియ్యం నిలువలు పరిశీలిస్తే ఈ పాసే కారణమని అధికారులు అంటున్నారు. ఇక బియ్యం తీసుకోవాలంటే కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు వచ్చి వేలు ముద్ర వేస్తేనే పంపిణీ చేయాలనే నిబంధనతో పాటు ప్రతి దుకాణంలో ఎలక్ట్రానిక్ కాంటాలపై తూకం వేయడం అలవాటుచేస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని కొందరు లబ్ధిదారులు పేర్కొన్నారు.

● కొడంగల్ పట్టణంలోని రేషన్ దుకాణం నెం. 7లో తనకు ఉన్న మొత్తం రేషన్ లబ్ధిదారులకు అందించినా కూడా రేషన్ డీలర్ కోటా మొత్తం అలాగే ఉందని చూపిస్తోంది. దీంతో డీలర్ ఆందోళన చెందారు. తిరిగి ఈ యంత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అప్పజెప్పారు. పైగా ఈ యంత్రాలతో కొంత మంది వేలి ముద్రలు సరిపోకపోవడంతో కుటుంబ సభ్యులలో మరొకరిని తీసుకొని వచ్చి సరకులు తీసుకొని వెళ్లాల్సి వచ్చింది.



రేషన్ దుకాణాల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ యంత్రాలు

స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలి

కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ

కాచిగూడ: పార్టీలకు అతీతంగా స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కోరారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తమ తమ ప్రాంతాల్లో పరిసరాల పారిశుద్ధ్యంలో భాగస్వాములు కావాలని కోరారు. పారిశుద్ధ్యంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారని, తర్వాత ఏమైందో తెలియదన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చాలా చోట్ల చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోందన్నారు. నగరంలో వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టి రహదారుల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. రైల్వేలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రయాణికులు సహకరించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఈ నెల 16 నుంచి 31 వరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పారిశుద్ధ్య లోపాలను సవరించుకుని ముందుకెళుతామన్నారు.

ప్రజల్లో మార్పుతోనే అవినీతి అంతం

మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: చట్టాలు ఎన్ని ఉన్నా ప్రజలు, సమాజంలో మార్పు ద్వారానే దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి అంతం సాధ్యమౌతుందని మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అవినీతి పట్ల అవగాహన కల్పించేందుకు యూత్ ఫర్ యాంటీ కరెప్షన్ (యాక్) సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి, లంచగొండితతాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అందుబాటులో ఉన్న చట్టాలపై కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. నార్వే, స్వీడన్, ఫిన్‌ల్యాండ్, సింగపూర్ వంటి దేశాల్లో అవినీతి చాలా తక్కువని, అక్కడి విలువలతో కూడిన విద్య ఉండటం వల్లే అది సాధ్యమయ్యిందన్నారు. మన దేశంలోని విద్యావ్యవస్థలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అవినీతికి ఊతమిస్తున్న ప్రధాన కారణమైన రాజకీయ అవినీతి, అధికార అవినీతిని అంతమొందించాలని అది యువతతోనే సాధ్యమౌతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. అవినీతి అంతమే లక్ష్యంగా పని చేస్తున్న యాక్ సంస్థ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని, తాము చేపట్టిన ఉద్యమానికి తనవంతు పూర్తి సహాకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈఎన్‌టీ వైద్యనిపుణులు, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డా. ఓరుగల్లు రవిశంకర్ మాట్లాడుతూ అవినీతిని అంతమొందించడం యువతతోనే సాధ్యమౌతుందన్నారు. యాక్ కన్వీనర్ రాజేందర్ మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన అవినీతిని రూపుమాపేందుకు సంస్థ ద్వారా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అవినీతిని అంతమొందించేందుకు కృషి చేస్తున్న పలువురు సంస్థ ప్రతినిధులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు లక్ష్మీనారాయణతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

పోటీలకు ఎంపికలు పూర్తి

కొడంగల్, న్యూస్‌టుడే: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17 కబడ్డీ పోటీలు హస్నాబాద్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి ఈనెల 24న జోన్ స్థాయి పోటీలు దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని పీఈటీ ఉపాధ్యాయులు రమేష్‌బాబు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ సూర్యనారాయణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుదురుమల్ల చెరువులో నుండి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారన్నారు. ఈ విషయాన్ని తాండూరు సబ్‌కలెక్టర్‌కు వివరించామని, ఆయన సూచన మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

సమస్యల మాలిక... తీర్చాలి మీరిక

వాహనాల రాకపోకలకు ఇక్కట్లు

పరిగి: పరిగి-మహబూబ్‌నగర్ రహదారిలో మిషన్ లారీలు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎదురుగా వస్తున్న వాహనాలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులు తీసుకువస్తున్న లారీలు వందల కొద్దీ రోడ్డుపైనే ఆపేశారు. దీంతో పలువురు భయాందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలం లేదా రోడ్డుకు ఒకే వైపు నిలిపి ఉంచాలని కోరుతున్నారు.



రెండు వైపులా ఉన్న లారీలు

రెండు బోర్డులు.. ప్రయాణమెటు?

పరిగి: బస్సుల రాకపోకలు ప్రయాణికులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఏ బస్సు ఎటు పోతుందో చివరకు వాహన చోదకులకే తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పరిగి డిపోలో బస్సు బోర్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే బస్సుకు పైన షాద్‌నగర్ అని, కింది భాగంలో దోమ - గుండాల్ అని రాసి ఉంది. దీంతో రెండు రూట్లలో ప్రయాణించే వారితో పాటు చదువుకున్న వారు కూడా ఈ బస్సు ఎక్కడికి వెళ్తుందని అడిగి మరీ ఎక్కాల్సి వస్తోంది. అధికారులు బోర్డులు మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఒకే బస్సుకు రెండు బోర్డులు

హలో ఈనాడు



పరిగి	:	8008573272
దోమ	:	8008573274
కుల్కచర్ల	:	8008573275
పూడూరు	:	8008573276
కుల్కచర్ల గ్రామీణ	:	7093981580

కుల్కచర్ల గ్రామీణ, పరిగి, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని బీసీ కాలనీలో మురుగు కాలువలు, అంతర్గత రోడ్లు సక్రమంగా లేవు. మురుగునీటితో దోమలు అధికమై అల్లాడిపోతున్నాం. సిమెంటు రోడ్డు, కాలువలు నిర్మించి ఇబ్బందులు నివారించాలి

– వెంకటయ్య, కాలనీవాసి

సమాధానం: దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. అధిక మొత్తంలో నిధులు విడుదలైన వెంటనే కాలనీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తాం

– విజయమాల, సర్పంచి

సమస్య: పత్తి, ఇతర పంటలపై పురుగులు పైర్లను నష్టపరుస్తున్నాయి. పవర్ స్ప్రేయర్లు అందుబాటులో లేక నివారణ చర్యలకు మరింత నష్టం జరుగుతోంది. రాయితీపై వెంటనే పంపిణీ చేసి ఆదుకోవాలి

– నర్సింలు, రాఘవాపూర్

సమాధానం: యాంత్రీకరణ పథకం కింద నిధులు విడుదల కాలేదు. రాగానే అందించేందుకు కృషి చేస్తాం.

– గంగాధర్, వ్యవసాయాధికారి, పరిగి

సమస్య: కామన్‌పల్లి గ్రామంలో ప్రధాన చౌరస్తా దగ్గర బోరు నుంచి వచ్చే నీరంతా రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. దీంతో రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. మురుగు నీటిని కాలువలోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, కామన్‌పల్లి

సమాధానం: గ్రామంలో మురుగు నీరు నిలువకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలంలో ఎక్కువగా మురుగు నీటి సమస్య ఉంటుంది. బోరు నుంచి నీటిని వృథాగా వదలరాదని కాలనీవాసులకు గతంలో పలుమార్లు సూచించాం. నీరు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– పాపేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి

సమస్య: దేప్లానాయక్‌తండాలో గత కొన్ని నెలలుగా ఆకాశ దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేపట్టాలని విద్యుత్తు అధికారులను కోరినా ఎవరు పట్టించుకోవడం లేదు. సమస్యను పరిష్కరించగలరు.

– శంకర్, దేప్లానాయక్‌తండా

సమాధానం: ఆకాశ దీపాలు మరమ్మతులకు గురైంది వాస్తవమే. మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ అధికారులకు తెలియపరిచాం. తగిన చర్యలు తీసుకుంటాం.

– సంతోష్, ఎంపీటీసీ

తహసీల్దారుకు సన్మానం

పరిగి, న్యూస్‌టుడే: ఉత్తమ తహసీల్దారుగా ఎంపికైన అబెద్‌అలీ, ఉత్తమ గ్రామ రెవెన్యూ అధికారిగా ఎంపికైన ఖదీర్‌ను పలువురు ప్రజా ప్రతినిధులు రెవెన్యూ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్.భాస్కర్, తెరాస నాయకుడు సయ్యద్‌పల్లి వెంకటయ్య తదితరులు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సేవాభావంతో పనిచేసే అధికారులకు ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, తెరాస, సీపీఎం నాయకులు డి.అశోక్, పి.నారాయణరెడ్డి, ఎం.వెంకటయ్య పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

సమయానుకూలంగా బస్సు నడపాలి

పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు మండల కేంద్రానికి ఉదయం పూట వస్తున్న బస్సును సమయానుకూలంగా నడిపించటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం 7.30 గంటలకు గ్రామానికి బస్సు వస్తున్నా వికారాబాద్ వెళ్లే వరకు కళాశాల సమయం మించి పోయిన తరువాత చేరుకోవాల్సి వస్తుందని కొందరు విద్యార్థులు వాపోయారు. ప్రతి రోజు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానుకూలంగా గ్రామానికి బస్సు చేరుకునే విధంగా అధికారులు దృష్టి సారించాలని వారు కోరారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని వడిచర్ల గ్రామానికి చెందిన మాల లక్ష్మప్పపై దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కులనిర్మూలన పోరాటసమితి నాయకులు ధర్నా చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తూ మాల లక్ష్మప్పను కులం పేరుతో దూషించి దాడిచేసిన వడ్డ వెంకటయ్య, జయమ్మ, శివకుమార్‌లపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏగా పనిచేస్తున్న మాల లక్ష్మయ్యకు న్యాయం చేయని తహసీల్దారు రాజేందర్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య ధర్నాలో మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కోకట్ చంద్రయ్య, రత్నం, వెంకటయ్య, యాదయ్య, లక్ష్మప్ప తదితరులు ఉన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో

నాగిరెడ్డిపల్లి, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: పాఠశాల, కళాశాల సమయాలకు బస్సులు నడపాలని కోరుతూ విద్యార్థులు బీజాపూర్- హైదరాబాద్ జాతీయరహదారిపై బైఠాయించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు చదువుల కోసం కొడంగల్ వెళ్తుండగా సమయానికి బస్సులు లేనందుకు ఇబ్బందులు పడుతున్నామంటూ విద్యార్థులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు ప్రమీలమ్మ పరిగి డిపో అధికారులతో మాట్లాడి, బస్సులు నడుపుతామని హామీ ఇవ్వడంతో విరమించారు.

అధ్యాత్మిక వాతావరణం పెరగాలి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చౌడాపూర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయ ప్రారంభోత్సవం జరిగింది. పరిగి శాసనసభ్యులు రాంమోహన్‌రెడ్డి, తెరాస పొలిట్‌బ్యూరో సభ్యులు హరీశ్వర్‌రెడ్డి తనయుడు అనిల్‌రెడ్డి, విపణి ఉపాధ్యక్షులు కొత్త ఉమాపతిరెడ్డి, అఖిల భారత బంజార సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు రవీందర్‌నాయక్, కొత్త రంగారెడ్డి తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల్లో అధ్యాత్మిక కార్యక్రమాలను మరిన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని, తద్వారా అందరికి మేలు చేకూరుతుందని వివరించారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవలసిన అవసరాన్ని వివరించారు.



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

పీఆర్‌టీయూకు ప్రజాదరణ

పూడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెద్దఉమ్మెంతాల్, మన్నెగూడ, రాకంచర్ల, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల శాఖ అధ్యక్షులు అమర్‌నాథ్‌లతో కలిసి బుధవారం పీఆర్‌టీయూ సభ్యత్వం నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా సంఘాన్ని ఆదరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, నాయకులు అంజిలయ్య, వేణుగోపాల్, శ్రీమన్నారాయణ, నజీమోద్దీన్, జాంగీర్, రవికుమార్, బాల్‌రాజ్, గురురాజ్, హన్మంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అంబీర్‌దాసు, భీమయ్య, రత్న, మహేందర్‌రెడ్డి ఉన్నారు.



సభ్యత్వం ఇస్తున్న శివకుమార్ సంఘం నాయకులు

రైతులకు పరిహారం అందించాలి

పూడూరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో భాగంలో గత ఏడాదిలో పంటలకు ప్రీమియం చెల్లించిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని తెరాస మండల యువజన విభాగం నాయకులు టి.రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది సాగులో ఉన్న వివిధ పంటలు ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఎంతో మంది రైతులు అప్పుల్లో తగిన ప్రీమియం చెల్లించినా అధికారులు పరిహారం మంజూరులో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారి ప్రీమియం చెల్లిస్తున్నా లాభం లేకుండా పోతుందని దీంతో ప్రైవేటు బీమా కంపెనీలు లాభం పొందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాచావ్‌కుంట తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షులు మాంగ్యానాయక్, విద్యావలంటీరు చంద్రకాంత్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దానికి తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. నేటి పరిస్థితుల్లో ప్రతిభ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.



పంపిణీ చేసిన దుస్తులతో విద్యార్థులు

పరిగి

బాల్యవివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

కోట్‌పల్లి: బాల్య వివాహాలను జరిపించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బుచ్చయ్య పేర్కొన్నారు. జిన్నారం గ్రామానికి చెందిన ఓ బాలికకు, అదే మండలంలోని బుగ్గపురం గ్రామానికి చెందిన మల్లేశంతో వివాహం జరిపిం చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారులు కుటుంబ సభ్యులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిచి బాల్య వివాహాలకు పాల్పడితే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో అవగాహన కల్పించి హామీ పత్రాన్ని రాయించుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఫోకస్



ప్రమాదకరంగా ఉన్న బావి

బావిని పూడ్చివేయండి

దోమ, న్యూస్‌టుడే: మండల కేంద్రం దోమలో గతంలో తాగునీటి సమస్యను తీర్చిన మంచినీళ్ల బావి నేడు నీళ్లు లేక పాడుబడింది. ఈ బావి సమీపంలో ప్రైవేటు పాఠశాల ఉంది. మూత్రవిసర్జన సమయంలో చిన్నారులు ఇక్కడికి వస్తారు. ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు లేక ఈ బావిలో కొందరు వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వచ్చి, వ్యాధులకు కారణమవుతుంది. అధికారులు స్పందించి బావిని పూడ్చి వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీటి ఒత్తిడి లేక...

దోమ, న్యూస్‌టుడే: వర్షాలు లేక సాగు చేసిన పైర్లు వాడిపోతున్నాయి. దీంతో నిత్యకూలీలకు ఉపాధి కరవైంది. అయితే అడపాదడపా వరినారు వేస్తున్న రైతుల పొలాలకు కూలీలు పనులకు వస్తున్నారు. ఉపాధిహామీలో చేసిన కూలీ డబ్బులు సకాలంలో అందడం లేదని ఆసక్తి చూపడం లేదు. దోమ మండల పరిధిలోని గంజిపల్లిలో ఓ రైతు వద్ద వరినారు వేస్తున్నారు. నారు తీసేందుకు కూలీలు పోటీ పడి వచ్చారు. అవసరమైన కూలీలను తీసుకుని మిగతావారిని ఇతరుల పనికి పంపారు.



వరి నారు తీస్తున్న కూలీలు

వాడుతున్న మెట్టపంటలు

ఐనాపూర్(దోమ), న్యూస్‌టుడే: వర్షాలు లేక సాగు చేసిన మెట్టపైర్లు ఎండుముఖం పట్టాయి. ఖరీఫ్ మొదట్లో వర్షాలు పడి కాస్త భూగర్భజలం పెరిగింది. గొట్టపు బావుల్లో మోటార్లు ఒత్తిడితో నీళ్లు పోయడంతో అన్నదాతల్లో ఆశలు రేపాయి. దీంతో వరిసాగుకు సమాయత్తమయ్యారు. వరినారు మళ్లు పోశారు. తీరా ప్రస్తుతం నారు వేయబోతే బోరు మోటర్లలో నీటి ఒత్తిడి తగ్గింది. దీంతో ఏం చేయాలో తోచడం లేదని రైతులు వాపోతున్నారు. వరుణుడు ముఖం చాటేయడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వరుణుడు కరుణిస్తే తప్ప వరి పండడం కష్టంగా ఉందని కర్షకులు పేర్కొంటున్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మంత్రిని బర్తరఫ్ చేయాలి

పరిగి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల పట్ల ఏపీ మంత్రి ఆదినారాయణ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ, మాదిగ టీచర్స్ యూనియన్, దళిత సంఘాలకు చెందిన ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. మంత్రి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు బుగ్గన్న, పెంటయ్య, వెంకటయ్య, బుచ్చన్న, శ్రీనివాస్, జంగయ్య, జైపాల్ మాట్లాడుతూ... దళితులపైన, రిజర్వేషన్లపైన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, అనంతయ్య, జనార్ధన్, ఎం.వెంకటయ్య, నర్సింహ్మారాజు, అమర్‌నాథ్, జహంగీర్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎక్కడివక్కడే...

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: అధికారులు గ్రామాలలో సమస్యలు పరిష్కరించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. దీంతో సమస్యలు ఎక్కడివక్కడే ఆగిపోయాయన్నారు. మండల సమావేశాల్లో అధికారులకు సమస్యలను విన్నవించినా ఏ విధమైన చొరవ చూపించడం లేదని, అంతేకాకుండా ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున చేపట్టాల్సిన చర్యలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని తెలిపారు. కనీసం గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లినట్లుగా ఎక్కడా కనిపించడం లేదు. దోమల నివారణ చర్యలు మాత్రం శూన్యంగానే కనిపిస్తున్నాయని మండల ప్రజలు తెలిపారు. సమావేశాల్లో మండల స్థాయి అధికారులు గ్రామ స్థాయి అధికారులకు సూచనలు ఇస్తున్నారు, కానీ గ్రామ స్థాయి అధికారులు మాత్రం శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామ సమస్యలపై కూడా శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.



సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: తపాలా శాఖలో ఏళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న ఉద్యోగులకు వెంటనే వేతన సవరణ చేయాలని మండల తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మిషన్ వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగారు. మండల కేంద్రంలోని పోస్టాఫీసు ఎదుట ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమను చూడాల్సిన అవసరం ఉందని, వారి లాగే తమకు తగిన సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో నేటి పరిస్థితుల్లో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని, ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ రవీందర్, తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు బాలరాజు, లక్ష్మణ్‌నాయక్, బుచ్చిలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఉత్సవాలు నిర్వహించాలి

పెద్దేముల్: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఈ నెల 18వ తేదీన తాండూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని గౌడ సంఘం ప్రతినిధి వరప్రసాద్ గౌడ్ కోరారు. ప్రధాన కూడళ్లల్లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించాలని ఆయన సూచించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన





ఉత్సవాలకు వస్తున్న హరీశ్వర్‌రెడ్డి, పూజలు నిర్వహిస్తున్న రవీందర్‌నాయక్, అనిల్ రెడ్డి తదితరులు

మేడిపల్లికలాన్ (పూడూరు): మండల పరిధిలోని మేడిపల్లికలాన్ హనుమాన్ మందిరంలో చేపట్టిన ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానికులే కాకుండా చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెరాస పొలిట్ బ్యూరో సభ్యులు హరీశ్వర్‌రెడ్డి, జాతీయ బంజార హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్‌నాయక్, నాయకులు అనిల్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ నర్సింహారెడ్డి, తెరాస మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం నాయకులు అజీం, శ్రీనివాస్‌గుప్త, తెరాస యువజన విభాగం మండల అధ్యక్షులు యాదవరెడ్డి తదితరులు హాజరయ్యి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచి ఉమాదేవీ నాయకులు గోపాల్‌రెడ్డి, రవికుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సిములు, వెంకటయ్య, రమేశ్ తదితరులున్నారు.

భక్తులకు అన్నదానం: తెరాస పొలిట్ బ్యూరో సభ్యులు హరీశ్వర్‌రెడ్డి తనయుడు అనిల్ రెడ్డి సహకారంతో స్థానిక తెరాస యువజన విభాగం మండల నాయకులు రఘునర్సింహారెడ్డి కుటుంబంచే భక్తులకు అన్నదానం జరిగింది.

భూ సర్వే నేటినుంచి

బంట్వారం: నేటి నుంచే మండలంలో ఇంటింటికీ భూ సర్వే నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17న బంట్వారం, 18న మాలసోమారం, రొంపల్లి, 19న మంగ్రాస్‌పల్లి, నాగ్వారం, సల్బత్తాపూర్, యాచారం, 21న మద్వాపూర్, 22న బొపునారం, తమ్మాపూర్, 23న సుల్తాన్‌పూర్ గ్రామాల్లో సమగ్రసర్వే నిర్వహిస్తామన్నారు. రైతుల పహణీ, 1బీ, కంప్యూటరీకరణ వంటి సమస్యలు వుంటే భూ సర్వే కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తే అప్పటికప్పుడే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

మోమిన్‌పేట: తపాలా సిబ్బంది వేతనాలు పెంచాలని మోమిన్‌పేట శాఖ పోస్టుమెన్‌ల సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యావసర సరకుల ధరలు పెరిగి పోయాయి.. కానీ తమ వేతనాల్ని సర్కారు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమలేశ్ చంద్ర కమిటీ సూచనల్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనిల్‌కుమార్, మొగులయ్య, భస్వరాజ్, రవిందర్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుల తయారీ నేడు

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా జిల్లాలోని వికారాబాద్ డివిజన్‌లోని ఏడు మండలాల్లో ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని డైట్ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఎకో ఫ్రెండ్లీ గణేష్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు ఇద్దరు విద్యార్థులను తోడుగా తీసుకరావాలని సూచించారు. విద్యార్థులకు మట్టితో వినాయకవిగ్రహాల తయారీలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ దీపిక, ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి సౌమ్య పాల్గొననున్నట్లు తెలిపారు.

CLASSIFIEDS

POULTRY

నిన్నటిరోజు NECC, హైదరాబాద్ జోన్ 100 కోడిగుడ్ల ఫారంగేటు ధర రూ॥ 355/- చిల్లర ధర రూ॥ 4.15 ఫోన్: 23240329, కల్‌బర్డ్ ధర రూ॥ 62/-per KG, ఫర్‌బర్డ్ ఫోన్: 9000371404.

AUTOMOTIVE



WANTED DEALERS/AGENTS

AYHC GHP ఫార్మసీ Hyd/ AP/ TS లో అన్ని మెడికల్ షాప్‌కి సప్లై కొరకు C/F డిస్ట్రిబ్యూటర్స్/ ఏజెంట్స్ up to 40% Income మీ పెట్టుబడి 8500906282.

BUSINESS OFFER

Data Entry new Project available with High Payout & Long Term Contract Min 5- Systems & Office setup Mandatory ✆ 8978148055.

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 95810 56712.

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 77995 18807.

HOME TUTIONS

క్యాపిటల్ హోమ్‌ట్యూషన్స్ KG to PG, Inter, T. EAMCET, NEET, IIT, JEE- మెయిన్స్, CA-CPT, B.Com, B.Tech, PG. వెల్‌కమ్ ట్యూటర్స్ ✆ 70362 98104.

WEIGHT LOSS CENTERS

5 వారాలలో డైట్ లేకుండా 8-10 KG ల బరువు, చేతులు, తోడలు, పొట్టసైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళనొప్పులు తగ్గుతాయి. Ph: 9059320974

FLAT FOR SALE

1St Floor Flat For Sale. 2BHK, Lift, Modular Semifurnished, 2 Balconies, 2 Bathrooms, Security Door To Balcony Road Facing Excellent Rent Value. Cellar Parking 950Sft. Matrusri Abode, Rk puram Flyover, Neredmet X Roads. ✆ 9544062036

PLOT FOR SALE

237 Square Yards Plot for sale. Opp: Brungi International School, Naskal Roads, Vikarabad. Cell: 8106064723

Excellent Investment Opportunity, Near Yadagirigutta. Plots Available at Nature Orchid, A HMDA approved Highway facing layout on Warangal Highway at Bhongir, Near Hotel Vivera, Opp: Government ITI. If Interested. Cont: Bhargavi : 9573051769.

కేవలం రూ: 1,25,000/- లకే 200 చ॥గ॥ల ఇంటిస్థలం హైదరాబాద్ (రామోజీఫిల్మ్‌సిటీ) చౌటుప్పల్ సమీపంలో NH:9, క్లి॥టైటిల్, స్పాట్ రిజి॥ ✆ 9948078062, 9848305444

TOLET / WANTED

ఆనంద్‌నగర్ కాలనీ, ఖైరతాబాద్ నందు 2BHK ఫ్లాట్ అద్దెకు కావలెను. (అపార్ట్‌మెంట్/ ఇండిపెండెంట్ హౌస్) ఫోన్: 9000602983.

JOBS

ఆఫీస్‌బాయ్స్: జీతం 10 వేలు, స్వంత Bike & License వున్నవారికి పెట్రోల్‌కు రూ.2 వేలు అదనం. 2 సం॥ల అనుభవం, ఇంటర్ (పాస్/ ఫెయిల్), వయస్సు 30 సం॥లోపు సోమాజిగూడ, ఫో: 9133467333.

UBER Bike Taxi: మీ 2 వీలర్‌ని ట్యాక్సీగా నడుపుతూ గంటకి 100/- సంపాదించండి. వెంటనే 040-39560690 పై కాల్ చేయండి.

నిరుద్యోగులకు శుభవార్త. హైదరాబాద్‌లో కొత్తగా ఓపెన్ చేసిన MNC కంపెనీలో పర్మినెంట్ జాబ్స్ కలవు. (Males) ఎటువంటి ఫీజు లేదు. వయస్సు 18-26. నెలకు 10-15 వేలు సంపాదన. రూమ్, ఫుడ్ ఫ్రీ. కృష్ణ ✆ 9030225252

ప్రముఖ టెలికాం కంపెనీ కొరకు 4G మొబైల్ కలిగిన స్త్రీ & పు Promotors కావలెను. Sal + PF & ESI + Inc. ✆ 95332 22991, 79816 32010.

TV 24x7 న్యూస్ ఛానల్‌లో పనిచేయుటకు రిపోర్టర్స్ కావలెను. Q: ఇంటర్, డిగ్రీ జీతం: 18,000 ✆ 9703241280/ 9393877596.

తాండ్రపాపారాయ వెలమ సత్రం శ్రీశైలంలో పనిచేయుటకు అడ్మిన్ ఆఫీసర్ (50 సం॥ పైబడి డిగ్రీ చదివిన) సూపర్‌వైజర్, కంప్యూటర్ నాలెడ్జ్‌గల అకౌంటెంట్ కావలెను. మంచి జీతం + ఉండుటకు వసతి + ఉచిత భోజనం. ఆల్ ఇండియా వెలమ అసోషియేషన్, హిమాయత్‌నగర్. ✆ 9246559119/ 9160672023

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

DRIVERS

డ్రైవర్లు కావలెను. జీతం 15-16 వేలు+ బెనిఫిట్స్, ఓనర్ వద్ద లగ్జరీ కార్లు నడుపుటకు సిటీ, హైవేలో 3-4 సం॥ల అనుభవం, 35 సం॥లోపు వయస్సు, బంజారాహిల్స్. ఫో: 9666872553

కేవలం Rs.30,000 డిపాజిట్ కట్టి UBERలో కారు యజమాని అవ్వండి. వెంటనే 040-39594688 పై కాల్ చేయండి.

ENGINEERING

CMAS Mtg of Construction Machinery @Cherlapally Looking for Electrical Engg with 3-5 Yrs Exp in Control Panel Wiring & VFD's HMI. ✆ 9397811468. admin@cmac.co.in

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



కొత్త కలెక్టరొచ్చారు..!

హైదరాబాద్ జిల్లా పాలనాధికారిగా డా.యోగితా రాణా ● బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఎవరు రాబోతున్నారు..? అంటూ కొన్ని రోజుల నుంచి జోరుగా చర్చ జరుగుతోంది. ఎవరికి తోచిన పేరు వాళ్లు చెప్పేవారు. ఎట్టకేలకు ఆ సందిగ్ధతకు తెర పడింది. అందరు ఊహించినట్లుగానే నిజామాబాద్ జిల్లా కలెక్టర్ డా.యోగితా రాణాను హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు ఇక్కడ పనిచేసిన రాహుల్ బొజ్జా ఉన్నత విద్య అభ్యసించేందుకు విదేశానికి సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవర్నీ నియమించలేదు. సంయుక్త కలెక్టర్ ఎం.ప్రశాంతికే ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. అనతికాలంలోనే డా.యోగితా రాణా సమర్థవంతమైన అధికారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పనిచేసిన చోటల్లా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అందరిచే శభాష్ అనిపించుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక పురస్కారాలను స్వీకరించారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన డా.యోగితా రాణా 2003 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. జమ్ము ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 2002లో సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించి ఐఆర్‌టీఎస్‌కు ఎంపికయ్యారు. 2003లో మరోసారి సివిల్స్‌కు హాజరైన ఆమె ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆరేళ్లపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. మూడేళ్ల పాటు జమ్ము కశ్మీర్‌లో డిప్యూటేషన్‌పై 'ఉమీద్' అనే ప్రాజెక్టులో పనిచేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా అక్కడి మహిళల్లో ఆర్థిక చైతన్యం తేవడమే దీని ఉద్దేశం. 2014లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. రైతులు, పేదలు, మహిళల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ యార్డులో రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేసేందుకుగాను ప్రత్యేక కేంద్రానికి శ్రీకారం చుట్టారు. రైతుల ఖాతాల్లోనే నేరుగా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నారు. 'ఈనాం' ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసినందుకుగాను ప్రధాని మోదీ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధితులను చేరదీసేందుకు మానవతా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల్లో చైతన్యం తేవడంతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు 20 శాతం నుంచి 60 శాతానికి పెరిగాయి. హరిత హారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలోనూ కృషి చేశారు. లక్ష్యం 3.35 కోట్ల మొక్కలైతే 3.43 కోట్ల మొక్కలు నాటించారు. ఇందుకుగాను గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ కలెక్టర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకుగాను కేంద్ర ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది.

మట్టి విగ్రహాల తయారీ పోటీలు

నారాయణగూడ: పర్యావరణానికి హాని లేకుండా గణేష్ నవరాత్రుల విశిష్టతను తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి, ఎన్‌జీసీల సంయుక్తాధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై పోటీలు నిర్వహించనుంది. బుధవారం నారాయణగూడలో ఎన్‌జీసీ సమన్వయకర్త ప్రభాకర్, కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే వారికి మట్టి అందిస్తామన్నారు. పూజ చేసేందుకు వాడే పత్రి విశేషాలనూ వివరిస్తామన్నారు. 18న ఉదయం సీఎంఆర్ మోడల్ స్కూల్ (బోయిన్‌పల్లి), అదే రోజు మధ్యాహ్నం సికింద్రాబాద్ మహబూబ్ కళాశాల, 19న నారాయణగూడ కేశవ స్మారక పాఠశాల, మధ్యాహ్నం మలక్‌పేట్ ప్రభుత్వ పాఠశాల, 20న పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్, మధ్యాహ్నం బోయిన్‌పల్లిలోని స్వర్ణధామ్ కాలనీలో పోటీలు ఉంటాయన్నారు. 22న సరస్వతి శిశుమందిర్ (బండ్లగూడ)లో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు ప్రశంసా పత్రాలు ఇస్తామని రాధిక వివరించారు. వివరాలకు 91002 69797, 92462 73583 నంబరులో సంప్రదించాలని కోరారు

మిస్ ట్విన్ సిటీ-2017 ఎంపిక ప్రక్రియ ప్రారంభం



మిస్ ట్విన్ సిటీ-2017 పోటీల ఎంపిక ప్రక్రియలో హొయలు పోతున్న యువతులు

అమీర్‌పేట: 'సూత్ర' ఆధ్వర్యంలో ఈ మాసాంతంలో నగరంలో నిర్వహించనున్న మిస్ ట్విన్ సిటీ-2017 పోటీల ప్రక్రియ బుధవారం ప్రారంభమయింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతులు ఎంపిక పోటీల్లో పాల్గొని ర్యాంప్‌పై క్యాట్‌వాక్‌తో ఆకట్టుకొన్నారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. అమీర్‌పేటలోని గ్రీన్ పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో దీనికి వేదికైంది. 15 మంది ముద్దుగుమ్మలు హాజరుకాగా ఫ్యాషన్ షో కూడా నిర్వహించారు. ఎంపికైన యువతులకు నిర్వాహకులైన మోనిక, ఉమేష్ మధ్యాన్‌లు బ్యాడ్జి నంబర్లను కేటాయించారు.

న్యాయస్థానానికి హాజరైన కేంద్ర మంత్రి

బంజారాహిల్స్: కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం ఎర్రమంజిల్‌లోని నాల్గో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో విచారణకు హాజరయ్యారు. 2014లో సాధారణ ఎన్నికల సమయంలో హిమాయత్‌నగర్‌లోని లిబర్టీ ప్రాంతంలో భాజపా ఆధ్వర్యంలో ఊరేగింపు తీశారు. ర్యాలీకి అనుమతి తీసుకున్న దానికంటే అధిక సంఖ్యలో జనాన్ని సమీకరించడంతో నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో భాగంగా కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం న్యాయస్థానానికి వచ్చారు. ఆ కేసు వివరాలు తెలుసుకున్న న్యాయమూర్తి తదుపరి విచారణను ఆగస్టు 30కి వాయిదా వేసినట్లు తెలిసింది.

నేటి నుంచి న్యాక్ బృందం పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్‌ల్లో ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజులపాటు న్యాక్ బృందాలు పర్యటించనున్నాయి. బృందం పర్యటించనున్న కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు విధులకు సక్రమంగా హాజరుకావాలని ఆయా వర్సిటీల వీసీలు పిలుపునిచ్చారు. ఆవరణలో విద్యార్థులు, ఉద్యోగులు, వసతిగృహాలు, తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు తదితర ప్రాంతాలను న్యాక్ బృందం పరిశీలించనుంది. వీటికి సంబంధించి వాస్తవ పరిస్థితిని వీడియోలు, చిత్రాలతో సేకరించనున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకుంటారు.

శ్వాస నాళంలోని కణతి తొలగింపు

గాంధీ ఆసుపత్రి: శ్వాస నాళంలో ఉన్న కణతి వల్ల ఓ విద్యార్థి మూడు నిమిషాలకోసారి విపరీతమైన దగ్గు.. శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడేవాడు. గాంధీ ఆసుపత్రి వైద్యులు ఆ విద్యార్థికి ఆరు గంటలు పాటు శస్త్రచికిత్స చేసి శ్వాస నాళం నుంచి కణతి తొలగించడమే కాకుండా ఇబ్బంది తొలగించారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, సీటీ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రవీందర్ ఈ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పార్డీ(బి) గ్రామానికి చెందిన సంతోష్, రమ దంపతుల కుమారుడు శ్రీకాంత్(16) ఇంటర్ చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి దగ్గు, దమ్ము, ఆయాసం వంటి సమస్యలతో బాధపడేవాడు. గత నెలలో సమస్య తీవ్రమవడంతో మహారాష్ట్రలోని యావత్‌మాల్, అక్కడి నుంచి వార్ధా, ఆ తర్వాత నాగ్‌పూర్‌లలోని ఆసుపత్రులకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి కణతి ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్సకు భారీగా ఖర్చవుతుందని, ప్రాణాలకు నమ్మకం లేదని చెప్పడంతో ఆగస్టు 1వ తేదీన గాంధీ ఆసుపత్రికి వచ్చారు. డాక్టర్ రవీందర్‌కు తమ కుమారుడి పరిస్థితిని వివరించారు. శ్రీకాంత్‌ను పరీక్షించిన రవీందర్ వెంటనే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. అప్పటికే సాయంత్రం కావడంతో వైద్యులు, సిబ్బంది ఇళ్లకి వెళ్లిపోయారు. అవసరమైన వారిని తిరిగి రప్పించి సాయంత్రం ఆరు గంటలకు శస్త్రచికిత్స ప్రారంభించి అర్ధరాత్రి ఒంటి గంటకు పూర్తి చేశారు. కణతి తొలగించడంతో శ్రీకాంత్ కోలుకున్నాడు. వైద్యపరిభాషలో దీన్ని 'ఎక్సిషన్ ఆఫ్ ట్రెకియల్ ట్యూమర్'గా పేర్కొంటారని, అరుదైన ఈ కణతికి విజయవంతంగా శస్త్రచికిత్స చేశామని తెలిపారు. వైద్యులు అరుణ్, సత్యజీ, సురేష్, భానులక్ష్మి తదితర బృందం ఇందులో పాల్గొన్నారు.

పోస్టల్ డాక్ సేవకుల సమ్మె

ఖైరతాబాద్: తపాలా శాఖలో గ్రామీణ డాక్ సేవక్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులు జాతీయ స్థాయిలో సమ్మెకు దిగారు. అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు హైదరాబాద్ సిటీ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు ఖైరతాబాద్‌లోని డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. హైదరాబాద్ సిటీ డివిజన్ కార్యదర్శి కె.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రోజూ ఎనిమిది గంటలకు పైగా పనిచేస్తున్నా ఐదు గంటలు మాత్రమే పనిచేస్తున్నట్లు హాజరు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఉద్యోగికి రూ.8వేల నుంచి రూ.10వేల మధ్య మాత్రమే వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలపై తమ యూనియన్ సూచించిన సవరణలతో పాటు జీడీఎస్ కమిటీ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ నివేదిక ప్రకారం 8 గంటలు పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలన్నారు. తమ సమ్మెపై కేంద్ర కమిటీ సూచించే దాకా విధులకు హాజరుకాకుండా రోజూ డివిజన్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహిస్తామన్నారు.

మహబూబ్‌నగర్‌లో 27న వాల్మీకి (బోయ) వధూవరుల వివాహ పరిచయ వేదిక

తట్టును తరిమేద్దాం.. పొంగును పారదోలుదాం!

(మొదటిపేజీ తరువాయి) అందుబాటులోకి వచ్చింది. ఈమేరకు జిల్లాలోని 2.56 లక్షల మంది చిన్నారులకు టీకాలను వేస్తామంటూ అధికారులు తెలిపారు. మొదటి విడతగా 1.36 లక్షల మంది చిన్నారులకు సరిపడా వ్యాక్సిన్ అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేర్చారు. అక్కడి నుంచి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు చేరవేస్తారు. సాధారణ టీకా కార్యక్రమం జరిగే అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అదనపు కేంద్రాలు ఉంటాయి. సంచార కేంద్రాలతో ఊరూరా తిరిగి పనిచేసుకునే వారిని, తాత్కాలికంగా వలస వచ్చే వారి పిల్లలకు సైతం వేస్తారు. జిల్లాలోని వైద్య ఉపకేంద్రాలు 156, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 20, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు 4, జిల్లా ఆసుపత్రిలోనూ టీకాల్ని అందుబాటులో ఉంచారు.

ఇలా ఉంటే వద్దు: దశరథ్, జిల్లా వైద్యాధికారి

గతంలో పిల్లలకు తట్టు రాకుండా టీకా వేయించి ఉన్నా ఇప్పుడు తప్పని సరిగా వేయించాలి. జ్వరం, తీవ్రమైన వ్యాధులు, స్పృహ కోల్పోవడం, అపస్మారక స్థితిలో ఉన్న చిన్నారులకు వీటిని వేయించవద్దు. గతంలో మీజిల్స్, రుబెల్లా టీకాతో తీవ్రమైన అలర్జీ, రియాక్షన్‌కు గురైన పిల్లలకు కూడా వేయవద్దు.

వైభవోపేతం.. నాట్య మహోత్సవం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకొని బుధవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 'సంకీర్తనా నాట్య మహోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అఖిల భారత కూచిపూడి నాట్యకళామండలి ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువులు తమ శిష్యులతో సప్తగిరీషుడికి నృత్యాంజలి ఘటించారు.

అనంతగిరిలో ఆయుష్ ఆసుపత్రి

(మొదటిపేజీ తరువాయి) ఆసుపత్రి ఏర్పాటు కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని, హరిత హోటల్‌ను రూ.కోటి వెచ్చించి పునరుద్ధరించడానికి పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా అనంతగిరి దేవాలయం, కోనేరును సైతం పరిశీలించారు. వారి వెంట ప్రిన్సిపల్ ఛీఫ్ కన్జర్వేటర్ మనోరంజన్ బంజా, అటవీశాఖ ప్రత్యేకాధికారి భూపాల్ రెడ్డి, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ కుక్కిరెడ్డి, టూరిజం శాఖ ఎం.డి. క్రిస్టినా, మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు సీఈఓ సోనిబాలా, జిల్లా ఎస్పీ అన్నపూర్ణ, డీఎఫ్ఓ శ్రీలక్ష్మి, ఆర్డీఓ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ చిన్నప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి) చేపల పెంపకానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల కులవృత్తుల వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతులకు పెట్టుబడి నిమిత్తం ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు అందజేస్తామన్నారు. ఇంకా ఎవరైనా ఒంటరి మహిళలు, ఆసరా పింఛన్ రాని లబ్ధిదారులు ఉంటే అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదించి, వాటిని పొందాలని సూచించారు. సమావేశంలో ఉపపాలనాధికారి సందీప్‌కుమార్, తహసీల్దారు రాములు, మున్సిపల్ అధ్యక్షురాలు సునీతాసంపత్, కౌన్సిలర్లు బొప్పి అంజలియాదవ్, వాలిశాంత్‌కుమార్, శ్రీనివాస్, తెరాస నాయకులు కరుణం పురుషోత్తంరావు, అబ్దుల్‌రవూఫ్, రాంలింగారెడ్డి, గిర్దావర్ ఆనందం, నియోజకవర్గంలోని వీఆర్‌ఓలు, మహిళలు పాల్గొన్నారు.

వారి రూటే సెప'రేటు'

(మొదటిపేజీ తరువాయి) కొనుగోలు చేస్తున్నారు. ముసలి జీవాలను సైతం అంటగడుతున్నారు. ఇరవై ఆడ, ఒక పొట్టేలును ఇవ్వాల్సి ఉండగా రెండు, మూడు పొట్టేళ్లను ఇస్తున్నారు. ఫలితంగా ఏడాది పాటు చిన్నపిల్లలను పోషించుకోవాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. పొట్టేలు చిన్నదిగా ఉండటంతో మరో పొటేలును కొనుగోలు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు.

కొనసాగుతున్న దళారుల రాజ్యం

జిల్లా అవసరాలకు సంబంధించిన జీవాల కొనుగోలుకు పక్కనే కర్ణాటక నుంచి గొర్రెలను తెచ్చేందుకు అనుమతించారు. అక్కడ డిమాండ్‌ను బట్టి దళారులు దందా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొర్రెల కొనుగోలుకు వెళితే నేరుగా రైతులను కాకుండా దళారులను కలిస్తేనే జీవాలు దొరుకుతున్నాయిని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఒక యూనిట్‌కు 21 గొర్రెలు అవసరం ఉండగా అందులో చిన్నవి, పెద్దవి, వయసుతో సంబంధం లేకుండా అన్నింటికీ ఒకే ధరను కడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు నష్టపోతున్నారు.



గొర్రె గిట్టకు వ్యాధి సోకడంతో పసరు వైద్యం చేసుకుంటున్న కాపలాదారులు

మృతిచెందిన వాటికి అందని బీమా

కర్ణాటక నుంచి తీసుకొస్తున్న గొర్రెలకు అక్కడే బీమా చేయిస్తున్నారు. రవాణా సమయంలో అనుకోకుండా మృతిచెందిన జీవాలకు బీమా సంస్థలు పరిహారం చెల్లిస్తాయని తెలిపారు. అయితే నష్టపోయిన రైతులకు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పరిహారం ఊసే లేకుండా పోయింది. ఒక్క బొంరాస్‌పేట గ్రామంలోనే మొత్తం 62 గొర్రెలు మృతి చెందినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. వీటికి సంబంధించి ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పరిహారం అందేలా చూడాలని వేడుకుంటున్నారు.

మాకు తప్పని ఇబ్బందులు

–మాటూరి మల్లయ్య, బొంరాస్‌పేట



రాయితీపై గొర్రెలను అందించే పథకం బాగున్నా అధికారుల తప్పిదాలతో లబ్ధిదారులు నష్టపోతున్నాం. నా కొడుకు పేరిట వచ్చిన గొర్రెల్లో ఉంటే చిన్నవి, లేదంటే వయసు పైబడిన వాటిని ఇచ్చారు. గొర్రె పొట్టేలు ఒకదాని బదులు రెండు, మూడు అవికూడా పిల్లలనే ఇస్తున్నారు. కొనుగోలు సమయంలో బాగున్నాయని అధికారులే అంటగడుతున్నారు. ఏడాది పాటుగా వాటిని పోషించుకుంటే లాభాలు వచ్చే అవకాశాలు కనిపించటంలేదు.

పాలు తాగే పిల్లలను ఇస్తే ఎట్లా

–పొట్ట యాదయ్య, బొంరాస్‌పేట



రాయితీపై అందించే వాటిలో పాలు తాగే గొర్రెపిల్లలు ఉంటున్నాయి. పొట్టేలు కూడా చిన్నగానే ఉండటంతో మేం నష్టపోతున్నాం. పొట్టేలు చిన్నగా ఉన్నందుకు ఇతరుల మందల్లోని మగ పొట్టేలును తీసుకొచ్చుకుంటున్నాం. రాయితీపై అందించిన గొర్రెలకు రోగాలొస్తే మందులు ఇవ్వటం లేదు. చిన్నచిన్న రోగాలొచ్చినా ప్రైవేట్ మెడికల్ షాపులకే చిట్టీలు రాస్తున్నారు. తెలిసిన వైద్యమే చేసుకుంటున్నాం. వేల సంఖ్యలో గొర్రెలను ఇస్తున్న అధికారులు వాటికొచ్చే రోగాలకు మందులు అందించకుంటే ఎట్లాగో వారే చెప్పాలి.

లబ్ధిదారులే ఎంపిక చేసుకుంటున్నారు

–జ్యోత్స్న, పశువైద్యాధికారి బొంరాస్‌పేట



గొర్రెల కొనుగోలు సమయంలో లబ్ధిదారులే స్వయంగా కర్ణాటక వెళ్లి అక్కడి యజమానుల దగ్గర నుంచి వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. వారు సమ్మతి తెలిపిన తర్వాతనే అమ్మకందారులకు డబ్బులను అందిస్తున్నాం. బీమా రావటంలో ఆలస్యం జరుగుతున్న మాట నిజమే. అయితే చనిపోయిన అన్ని గొర్రెలకు పరిహారం వస్తుంది. యూనిట్ విలువతో సమానంగానే బీమా డబ్బులు వస్తాయి.

హుస్సేన్ సాగర్ కష్టం తీరనుంది..!

- ★ నేటికీ కలుస్తున్న ప్రమాదకర రసాయన వ్యర్థాలు
- ★ నెలల కొద్దీ పెండింగ్‌లోనే కొత్త ఐఅండ్‌డీ
- ★ తాజాగా ప్రాజెక్టుకు మోక్షం
- ★ పూర్తయితే మురుగు కలవదంటున్న హెచ్ఎండీఏ

ఈనాడు, హైదరాబాద్

హుస్సేన్‌సాగర్ కష్టం తీరనుంది.. హుస్సేన్‌సాగర్ ఏంటి.. కష్టాలేంటనేగా మీ సందేహం.. రూ. వందల కోట్లతో చేపట్టిన ప్రక్షాళన పనులు గరళానికి అడ్డుకట్ట వేయలేకపోయాయి. పైగా.. రోజురోజుకీ పెరుగుతున్న ప్రమాదకర రసాయన వ్యర్థాలతో అసలుకే ఎసరొచ్చే ప్రమాదం ఏర్పడింది. ఈ తరుణంలోనే కూకట్‌పల్లి నాలా నుంచి చుక్క మురుగు సాగర్‌లోకి చేరకుండా మళ్లించేందుకు నెక్లెస్ రోడ్డులో నిర్మించ తలపెట్టిన 150 ఎంఎల్‌డీ ఐఅండ్‌డీ(ఇంటర్‌సెప్షన్ అండ్ డైవర్షన్)కి ఎట్టకేలకు మోక్షం లభించింది. నెలల కొద్దీ పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు పనులు తాజాగా పట్టాలెక్కాయి.

ఇప్పటి వరకు హుస్సేన్ సాగర్ ప్రక్షాళన కోసం ఎంత ఖర్చు పెట్టారో తెలిస్తే ముక్కున వేలేసుకోక మానరు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ. 400 కోట్లకు పైమాటే. ఒక్క హెచ్ఎండీఏనే రూ. 370 కోట్ల వరకు వెచ్చించింది. ఇందులో జైకా రుణం రూ.310 కోట్లు కాగా.. మిగిలిన రూ.60 కోట్లను ప్రభుత్వం సమకూర్చింది. ఇదీ కాకుండా కూకట్‌పల్లి నాలా మళ్లించేందుకు జల మండలి సుమారు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రక్షాళన పనులు వేగిరమయ్యాయి. బంజారా, పికెట్, బల్కాపూర్ నాలాల నుంచి వచ్చే మురుగు నీటిని సాగర్‌లో చేరకుండా నేరుగా మూసీలోకి మళ్లించారు. సాగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు.. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు విదేశాల నుంచి అధునాతన యంత్రాలను తెప్పించారు.

ఏం లాభం..?

ప్రక్షాళన పనులు కొంత వరకు సత్ఫలితాలనిచ్చాయి. గతంతో పోలిస్తే కాలుష్యం కొద్దిగా తగ్గినట్లుగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), ఈపీటీఆర్ఐ తేల్చింది. ఈ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. తగ్గినట్లే తగ్గిన కాలుష్యం.. మళ్లీ పెరిగింది. ఏంటని ఆరా తీస్తే అసలు విషయం వెలుగు చూసింది. కూకట్‌పల్లి నాలా నుంచి ఇప్పటికీ ప్రమాదకర రసాయన వ్యర్థాలు కలుస్తున్నట్లుగా గుర్తించారు. ఇందుకు ప్రధాన కారణం ఆ నాలాను మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ సామర్థ్యం.. అప్పటికే నెక్లెస్‌రోడ్డులో ఉన్న ఐఅండ్‌డీ సామర్థ్యం కంటే తక్కువగా ఉండటమేనని తేల్చారు. రాత్రయితే చాలూ.. గరళం కలుస్తున్నట్లుగా పీసీబీ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో గుర్తించారు. అడ్డుకట్ట వేయకపోతే రూ.వందల కోట్లు బూడిదలో పోసిన పన్నీరుగా మారడం ఖాయమని స్పష్టం చేశారు. అప్రమత్తమైన హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ అధికారులు ఏం చేయాలనే అంశంపై కసరత్తు చేశారు. ఇప్పుడే కాదు.. భవిష్యత్తులోనూ చుక్క మురుగు చేరకుండా కొత్తగా 150 ఎంఎల్‌డీ ఐఅండ్‌డీ నిర్మించాలని నిర్ణయించారు. ముందుగా బేగంపేట్ ప్రకాష్‌నగర్ వద్ద అనుకున్నారు. కానీ.. అక్కడ సాధ్యం కాకపోవడంతో ప్రస్తుతం నెక్లెస్ రోడ్డులో ఉన్న 100 ఎంఎల్‌డీ ఐఅండ్‌డీ పక్కనే కొత్త దాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

సమయం పట్టింది..!

నెక్లెస్ రోడ్డులో కొత్తగా నిర్మించ తలపెట్టిన ఐఅండ్‌డీకి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ గతేడాది చివర్లోనే హెచ్ఎండీఏకు అప్పగించింది. రూ.6.10 కోట్లు ఖర్చవుతుందని లెక్క తేల్చింది. వెంటనే హెచ్ఎండీఏ ఇంజినీర్లు మార్పులు చేర్పులు చేసి.. పరిపాలనపరమైన అనుమతుల కోసం అయిదారు నెలల కిందటే ప్రభుత్వానికి పంపించింది. అయితే.. ఏం జరిగిందో తెలియదు కానీ పనులు మాత్రం పట్టాలెక్కలేదు. నెలలు గడుస్తున్నాయి.. అయినా.. ప్రాజెక్టు మాత్రం పట్టాలెక్కలేదు. మరోవైపు ఫతేనగర్, బాలానగర్ తదితర ప్రాంతాల్లోని ఎలక్ట్రోప్లేటింగ్ పరిశ్రమల నుంచి ప్రమాదకర వ్యర్థాలు కలుస్తుండటంతో సాగర్‌లో ప్రమాదకరమైన కాడ్మియం తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్నట్లుగా పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నాళ్ల పాటు ఇదే జరిగితే రూ.వందల కోట్లు వృథా కావడమే కాకుండా స్వచ్ఛ సాగరం ఇక కలగానే మిగిలిపోతుందంటూ హెచ్చరించారు. తాజాగా కొత్త ఐఅండ్‌డీకి మోక్షం లభించింది. టెండర్ ప్రక్రియ ద్వారా గుత్తేదారు సంస్థను ఎంపిక చేసి.. పనుల్ని అప్పగించారు. తాజాగా పది రోజుల కిందట పనులు ప్రారంభమయ్యాయి. ఆరు నెలల్లో పూర్తి చేయాలని హెచ్ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. వర్షాకాలం కావడంతో పనుల్లో కొద్దిగా జాప్యం చోటుచేసుకోనుంది. గణేష్ ఉత్సవాల సందర్భంగా కూడా కొన్ని రోజులు బ్రేక్ ఇవ్వనున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి వరకు కొత్త ఐఅండ్‌డీని అందుబాటులోకి తేనున్నట్లుగా అధికారులు వివరిస్తున్నారు.



జిల్లాలో వ్యాపార వాణిజ్య పట్టణంగా పేరొందిన తాండూరులో వాహనదారుల్లో అనూహ్యంగా మార్పు కనిపిస్తోంది. గతంలో అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తూ... రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగించే స్థానంలోనే ప్రధాన కూడళ్లలో క్రమపద్ధతిలో వెళుతున్నారు. తాజా పరిణామంతో అయిదు, పది నిమిషాలకోసారి ట్రాఫిక్‌కు అంతరాయం జరిగే సమస్య నుంచి విముక్తి లభించింది. తాండూరు ఉప పాలనాధికారి సందీప్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతోనే ఇది సాధ్యమైంది. ఇవీ వివరాలు...

నేడు సరైన పథం

ట్రాఫిక్ సిగ్నళ్లపై పెరిగిన అవగాహన ▫ తాండూరులో కనిపిస్తున్న మార్పు

న్యూస్‌టుడే, తాండూరు

తాండూరులో 750 నాపరాళ్ల నునుపు కేంద్రాలు ఉన్నాయి. రోజువారీ వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగే విపణి సైతం ఉంది. వందలాది లారీలను నిలిపే ప్రాంతం కూడా ఇక్కడే ఉంది. దీనికితోడు పట్టణానికి పది నుంచి 14 కిలోమీటర్ల దూరంలోనే నాలుగు వందల నాపరాళ్లు, సుద్ద, లేటరైట్ గనులు ఉన్నాయి. అయిదు సిమెంట్ కర్మాగారాలు నడుస్తున్నాయి. పట్టణం మీదుగానే ముంబై, బెంగళూరు నగరాలకు వెళ్లేందుకు అనుసంధానంగా ఉన్న రాష్ట్ర రహదారులు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజు అయిదు వేలకుపైగా లారీలు సరకుల ఎగుమతులు, దిగుమతులు చేయడానికి తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, గోవా, మహారాష్ట్ర, కర్ణాటకలకు వచ్చి పోతుంటాయి. ఇవికాకుండా బస్సులు, చిన్న లారీలు, జీపులు, కార్లు, ద్విచక్ర వాహనాలు సైతం పదివేలకు పైగానే ఉన్నాయి. అత్యధిక వాహనాలు పట్టణంలోని ఇందిరాచౌక్, అంబేడ్కర్ చౌక్, శివాజీ చౌక్, విలియం మూన్ పాఠశాల కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ప్రతి కూడలీ నాలుగు రహదారులను కలిపేదిగా ఉంది. అయితే ట్రాఫిక్‌పై అవగాహన లేకపోవడంతో చోదకులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నడిపేవారు. దీంతో ఒక వాహనాన్ని మరో వాహనం తరచూ ఢీకొనేవి. పలుమార్లు పాదచారులను సైతం ఢీకొట్టగా వారు గాయాలపాలయ్యారు. సమస్య పరిష్కారానికి కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయడమే ఉత్తమమంటూ పోలీసులు నిర్ణయించారు. ఈమేరకు రూ.16.37 లక్షలు ఖర్చు అవుతాయంటూ పురపాలక సంఘం అధికారులకు ప్రతిపాదించారు. నిధులు లేవంటూ వారు చేతులెత్తేశారు.

చొరవ చూపిన ఉపపాలనాధికారి

సమస్యను గుర్తించిన తాండూరు ఉపపాలనాధికారి సందీప్ కుమార్‌ఝా ప్రత్యేక చొరవ చూపారు. నాలుగు చోట్ల సిగ్నల్స్ ఏర్పాటుకు అవసరమైన నిధుల కోసం సిమెంటు కర్మాగారాల యాజమాన్యాలతో చర్చించారు. ఇండియా సిమెంట్స్, చెట్టినాడు, వికాట్‌సాగర్, పెన్నా సిమెంట్ యాజమాన్యాలు సిగ్నల్స్ ఏర్పాటుకు సంబంధించిన నిధులు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. జిల్లా పాలనాధికారిణి దివ్యదేవరాజన్ అధికారికంగా కొన్ని నిధులను విడుదల చేయగా మొత్తం రూ.16.37 లక్షలు పోగయ్యాయి. వెంటనే నాలుగుచోట్లా సిగ్నల్స్‌ను బిగించారు. జూన్ 6వ తేదీన రాష్ట్ర రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి వాటిని ప్రారంభించారు.

ప్రారంభంలో తడబాటు

మొదట్లో వాహనదారులు సిగ్నల్స్ విషయంలో అవగాహన లేక తడబడ్డారు. స్థానిక పోలీసులు సిగ్నల్ వ్యవస్థపై అన్నిరకాల వాహనాల చోదకులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. క్రమేపీ వారిలో మార్పు కనిపించింది. వాహనాలను క్రమపద్ధతిలో నడిపించడం నేర్చుకున్నారు. రెండు నెలల క్రితం వరకు అడ్డదిడ్డంగా వెళ్లిన వాహనాలు ప్రస్తుతం క్రమపద్ధతిలో నడుస్తున్నాయి. ఎర్రలైటు పడగానే చోదకులు ఆగిపోతున్నారు. పచ్చలలైటు పడగానే ముందుకు కదులుతున్నారు ఇప్పుడు ప్రధాన కూడళ్ల నుంచి వాహనాలు సాఫీగా వెళుతున్నాయి. గతంలో మాదిరిగా జరిగే ప్రమాదాలు తగ్గు ముఖం పట్టాయి.


ప్రస్తుతం ఎర్రలైటు పడడంతో ఆగిపోయిన వాహనాలు

ఇక తాగునీరు సురక్షితం!

కాగ్నా నదిలో బావులపై సంచుల కప్పివేత


కాగ్నా నదిలోని బావుల మీద కప్పిన సంచులు

తాండూరు పట్టణ ప్రజలకు తాగునీరు కలుషితం కాకుండా పురపాలక సంఘం అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణానికి తాగు నీటిని అందిస్తున్న కాగ్నా నదిలో బావులు ఉన్నాయి. బావుల నుంచి విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులను నింపి వాటి నుంచి పైపుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తారు. వర్షా కాలంలో వరదలు వస్తే కాగ్నా నదిలో ఉన్న బావుల్లోకి వరద నీరు చేరి తాగు నీరు కలుషితం అవుతుంది. నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇక నుంచి కాగ్నా నదిలోని బావుల్లో వరద నీరు చేరి తాగు నీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగ్నా నదిలోని బావుల మీద రెండు వరుసలతో నెట్ (కవర్లు)లు కప్పుతున్నారు. మొత్తం నాలుగు బావుల మీద సంచులను కప్పుతున్నారు. దీంతో పాటు పట్టణంలోని తాగు నీటి పైపుల లీకేజీలను సైతం అరికట్టాడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం రూ.2లక్షల దాకా ఖర్చు చేయనున్నారు. రెండు మూడు రోజుల్లో తాగు నీరు కలుషిత నివారణ పనులు పూర్తి చేస్తామని పురపాలక సంఘః ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

– న్యూస్‌టుడే, తాండూరు పట్టణం

అందిస్తే ప్రోత్సాహం... అందించరా పతకం!

న్యూస్‌టుడే, కుల్కచర్ల

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి మూడు విభాగాల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఒకమారు ఎంపికైతే ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య అందిస్తారు. అంతేకాదు ప్రత్యేకంగా క్రీడల్లో తర్ఫీదును ఇచ్చి మంచి క్రీడాకారులుగా తయారుచేస్తారు. విద్యార్థుల చెంత ఇంత చక్కటి అవకాశాలున్నా వీటి గురించి విద్యార్థులకు తెలియక పోవడం, సరైన వివరాలు అందించే వారు లేకపోవడం వంటి కారణాలతో ఎందరో ఔత్సాహికులు మరుగున్న పడిపోతున్నారు.

ఎంపిక కోసం ముంగిట ఉన్న అవకాశాలను ఉపాధ్యాయులు సైతం సరిగ్గా సద్వినియోగం చేసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల్లోను సరైన అవగాహన లేక తమ పిల్లలకు ఆసక్తి ఉన్నా వారిని క్రీడాపాఠశాల వైపు మళ్లించలేకపోతున్నారు. పదుల సంఖ్యలో పాఠశాలలు మండలాల్లో ఉంటే కేవలం మూడు, నాలుగు పాఠశాలల నుంచి విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. అది కూడా అవగాహన ఉన్న పిల్లల తల్లిదండ్రుల చొరవ, లేక ఏదైనా స్వచ్ఛంద సంస్థ చొరవ చూపితే వస్తున్నారు. ఈ నేపథ్యంలో వీటిలో ఎంపిక ఎలా ఉంటుంది? అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల పాత్ర తదితర అంశాలపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం...

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపాలి

ప్రతి సంవత్సరం జూన్ జులై నెలల్లో క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలను నిర్వహిస్తారు. ఇందుకోసం మొదట మండల స్థాయిలో విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. దీనికి క్రీడల అధికారులు ముందుగానే ప్రకటనను జారీచేస్తారు. ప్రకటనకు అనుగుణంగా ఆయా మండల కేంద్రాల్లో ఎంపికను నిర్వహిస్తారు. ఇక్కడ ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి. కానీ వారికీ సరైన అవగాహన లేకపోవడంతో వారు అంతగా ఆసక్తిని చూపడం లేదని కొందరు ఉపాధ్యాయులు తెలిపారు. నాలుగో తరగతిలోనే ఎంపిక ఉంటుందన్న సంగతి తల్లిదండ్రులకు కూడా తెలియదు. ఇటీవల కుల్కచర్ల మండల కేంద్రంలో ఎంపిక జరిగితే పట్టుమని కేవలం నాలుగు పాఠశాలల నుంచి 30 మంది మాత్రమే వచ్చారు. ఇందులో ఒ ప్రయివేటు పాఠశాల పిల్లలుకూడా ఉన్నారు. వచ్చిన విద్యార్థుల్లో పలువురు తల్లిదండ్రులు ప్రత్యేకంగా ఆసక్తిని చూపి తమ పిల్లలను తీసుకువచ్చారు. ఓ స్వచ్ఛంద సంస్థ క్రియాశీలకంగా వ్యవహరించి వారి అధ్వర్యంలో 20 మందికి పైగా విద్యార్థులకు వారే తర్ఫీదును ఇచ్చి ఎంపికకు తీసుకువచ్చారు.


పరుగులో పోటీ పడుతున్న విద్యార్థులు



ఆడుకోవడం అంటే పిల్లలకు చాలా ఇష్టం. ఆసక్తి ఉన్న చిన్నారులను వెన్నుతట్టి ప్రోత్సహించి క్రీడల్లో తీర్చిదిద్దితే వారి ప్రతిభ వెలుగుచూస్తుంది. అత్యుత్తమ పతకాలు సాధించి దేశ ఖ్యాతిని నలుదిశలా ఇనుమడింపజేస్తారు. దీనికి పట్టణ, గ్రామీణ అనే తేడాలేదు. ఇందుకోసమే జిల్లాలో మూడుచోట్ల క్రీడా పాఠశాలలను కూడా ఏర్పాటుచేశారు. వీటిలో ప్రవేశానికి ప్రాథమిక స్థాయిలో నాలుగో తరగతి చదువుతుండగానే విద్యార్థులను క్రీడాపాఠశాలకు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

- ఔత్సాహికుల కోసం క్రీడా పాఠశాలల ఎదురుచూపులు
- ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమం అన్నీ ఉచితం
- చొరవచూపాలి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఇవే క్రీడా పాఠశాలలు

1) హకీంపేట (హైదరాబాద్ సమీపంలో), 2) కరీంనగర్, 3) ఆదిలాబాద్. ఈ మూడు చోట్ల ఉన్న క్రీడా పాఠశాలలకు ప్రతి సంవత్సరం మొత్తం 120 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇందులో 60 మంది బాలికలకుకూడా చోటు కల్పిస్తారు.



పోటీలు నిర్వహించే క్రీడలు

క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం విద్యార్థులకు ఈ కింది అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు.

- 30 మీటర్ల మీటర్ల ఫ్లైలింగ్ స్టార్ట్
- 60 మీటర్ల షటిల్ పరుగు
- నిల్చున్న దగర నుంచే దూరంగా దూకడం (స్టాండింగ్ బ్రాడ్ జంప్)
- వర్టికల్ జంప్
- ఫ్లెక్సిబిలిటీ (నిల్చున్న చోటు నుంచి కిందకు వంగడం)
- మెడిసిన్ బాల్ త్రో
- 800 మీటర్ల పరుగు పందెం

ఎంపికైతే...

ఎంపికకు విద్యార్థులకు తగిన శిక్షణ పాఠశాలల్లోనే కనీసం నెలరోజుల పాటు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో తల్లిదండ్రులకు పిల్లలు క్రీడల్లో పాల్గొనడం, ఎంపిక, తద్వారా భవిష్యత్తుకు మంచి బాట ఏర్పడుతుందనే దానిపై అవగాహనను పెంచాల్సిన అవసరం ఉంది. మండల, జిల్ల స్థాయిలలో ఎంపిక అనంతరం చివరగా రాష్ట్ర స్థాయిలో ఎంపికను నిర్వహిస్తారు. అక్కడ ఎంపికైతే చాలు ఇక నగరంలోని హకీంపేటలో గల క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందవచ్చు. అక్కడ విద్యార్థుల్లో ఏ క్రీడపై ఆసక్తి ఉంది? తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రత్యేకంగా ఉండే కోచ్‌ల అధ్వర్యంలో క్రీడల్లో భవిష్యత్తుకు ఉపయోగడే విధంగా తీర్చిదిద్దుతారు. అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తారు. ఇంటర్ వరకు అన్నీ తామై చూసుకుంటారు.



పెరగాలి అవగాహన

క్రీడాపాఠశాలకు ఎంపికకు సంబంధించి గ్రామీణ ప్రాంతంలో మరింత అవగాహన పెరగాల్సి ఉంది. ఒక్కో మండలంలో 40-60 మధ్య ప్రాథమిక పాఠశాలలు ఉంటే మండల స్థాయి ఎంపికలకు ఒక్కో పాఠశాలకు కనీసం ఒక్కరు కూడా రావడం లేదు. దీనికి ప్రధాన కారణం క్రీడా పాఠశాలలో చేరితే మంచి భవిష్యత్తు ఉందనే విషయం వారికి తెలియక పోవడం. దీనికి గాను ప్రధానంగా ప్రధానోపాధ్యాయులు తగిన ఆసక్తిని చూపాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల జరిగిన ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 18 మండలాలు ఉండగా జిల్లా స్థాయికి కేవలం 70 మంది మాత్రమే పోటీలకు వచ్చారు.



ప్రతి ఏటా ఎంపికయ్యే విధంగా శ్రద్ధ వహిస్తున్నాం

– నర్సింలు, స్వచ్ఛంద సంస్థ మండల ఇన్‌ఛార్జి

గత అయిదారేళ్ల నుంచి క్రీడా పాఠశాలలకు ఎంపిక కోసం దాదాపు అన్ని పాఠశాలలకు తగిన సమాచారం ఇస్తున్నాం. వారు ఆసక్తి చూపడం లేదు.

కేవలం మూడు, నాలుగు పాఠశాలల వారే స్పందిస్తున్నారు. ఆసక్తి కనబరిచిన విద్యార్థులను కూడా మేమే శిక్షణ, అవగాహనను కల్పిస్తూ ఎంపిక వరకు తీసుకువచ్చేందుకుకృషి చేస్తున్నాం.

అధికారుల నుంచి సమాచారం అందడం లేదు

– మల్లికార్జున్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ముజాహిద్‌పూర్

క్రీడా పాఠశాలకు ఎంపికకు సంబంధించి అధికారుల నుంచి క్షేత్రస్థాయికి తగిన సమాచారం రావడం లేదు. దీంతో తగిన విధంగా ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సకాలంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. జిల్లా కేంద్రంలో సైతం మండల స్థాయి ఎంపికను నిర్వహించడంలేదు. క్రీడలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. కనీసం ఇప్పటి నుంచైనా అధికారులు క్షేత్రస్థాయికి క్రీడల సమాచారాన్ని చేరేలా ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఉంది.

చక్కటి సంకల్పానికి... సహకార బలం!

- వేలాది మట్టి గణేషుని ప్రతిమల తయారీలో నిమగ్నమైన స్వామి
- 7 సంవత్సరాలుగా నిరంతర కృషి

న్యూస్‌టుడ, కుల్కచర్ల

వినాయక చవితి వచ్చిందంటే విగ్రహాల పండుగ వచ్చేసినట్లే. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా వాడవాడలా విగ్రహాలను ఏర్పాటుచేస్తారు. అయితే విగ్రహానికి అందం రావాలని రకరకాల రసాయనాలతో కూడిన రంగులను వాడటం వల్ల పర్యావరణం దెబ్బ తింటోందని ఉత్సవాలు జరుగుతున్న ప్రతిసారీ పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. న్యాయ వ్యవస్థలు సైతం స్పందిస్తూ పలు సూచనలు చేస్తూనే ఉన్నాయి. ఈ విషయంలో మట్టి ప్రతిమలకు ప్రాధాన్యం ఇవ్వాలని పర్యావరణ ప్రేమికులు తమకు తోచిన రీతిలో ప్రచారం చేస్తున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ఓ యువకుడు సుమారు 7 సంవత్సరాల క్రితమే తన వంతుగా మట్టి ప్రతిమలను తయారు చేయాలని సంకల్పించారు. అతని సంకల్పానికి అందరి సహకారం తోడవుతుండటంతో వేల సంఖ్యలో మట్టి ప్రతిమలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తున్నారు. అతనే కుల్కచర్ల మండలం చాపలగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి స్వామి. వివరాల్లోకి వెళితే....

ఆలోచన ఎలా వచ్చిందంటే....

చవితి వచ్చినప్పుడల్లా ప్రతిమల తయారీలో రంగుల వాడకాన్ని మానివేయాలని, పర్యావరణ హితాన్ని కాంక్షించాలని మేధావులు పేర్కొంటున్నారు. ఇలాంటి మాటలను తరచూ వింటున్న స్వామి అప్పటికే తమ వృత్తిలో కొంత అనుభవం ఉండటంతో తానెందుకు మట్టి విగ్రహాలను తయారు చేయకూడదన్న ఆలోచన తట్టింది. దీంతో ఏడేళ్ల క్రితమే ప్రతిమల తయారీని మట్టితో చేయడం మొదలు పెట్టారు. మొదటి ఏడాది ఉచితంగాను ప్రతిమలను అందజేశారు. ఈయన ఉత్సుకతను చూసిన అప్పటి కుల్కచర్ల బ్యాంకు మేనేజర్ మూర్తి బ్యాంకు నుంచి రుణాన్ని అందించారు. ఇక అప్పటి నుంచి తన కృషిని కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రజల నుంచి ఏయేటికాయేడు ఆదరణ పెరుగుతోంది.





మంచి ఆదరణ

స్వామి ఉత్సాహాన్ని, ఆలోచనలను గమనించిన పర్యావరణ ప్రేమికులతో పాటు హెచ్ఎండీఏ మూడేళ్లుగా మంచి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. హెచ్ఎండీఏ తన వెబ్‌సైట్లో సైతం స్వామి తయారు చేస్తున్న మట్టి విగ్రహాల సమాచారాన్ని ఉంచింది. దీంతో విజయవాడ, అనంతపూర్, కరీంనగర్, బెంగుళూరు, జహీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మట్టి విగ్రహాలను సరఫరా చేయాలంటూ వినతులు వస్తున్నాయి.

ఏడాదంతా తయారీ.....

ప్రతి ఏటా వినాయక చవితి ముగిసిన తరువాత నవంబర్ నుంచి మట్టి విగ్రహాల తయారీని స్వామి తన సొంత గ్రామం చాపలగూడెంలో ప్రారంభిస్తున్నారు. తయారీలో పాల్గొనేందుకు ఇతర ప్రాంతల నుంచి పలువురు పనులు చేస్తున్నారు. దీనికి తోడు స్థానికంగా 30 మంది ఉపాధి పొందుతున్నారు. ఈ ఏడాది నాలుగు, అయిదు అడుగులవి 1500, రెండు ఫీట్ల లోపు 30 వేల విగ్రహాలను తయారు చేసి చవితికి సిద్ధం చేస్తున్నారు. స్వామి ఉత్సాహాన్ని చూసిన ఖాదీ బోర్డుతోపాటు మరో బ్యాంకు సైతం రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చాయి.

ఎంతో తృప్తి లభిస్తోంది

– స్వామి, చాపలగూడెం, విగ్రహాల తయారీదారుడు



పర్యావరణహితాన్ని కాంక్షించి ముందుకు పోవడానికి నా వంతుగా కృషి చేస్తున్నా. దీని వల్ల ఎంతో తృప్తి కలుగుతోంది. ఏడేళ్ల క్రితం చిన్నగా ప్రారంభించిన మట్టి గణేషుని ప్రతిమల తయారీకి నేడు అందరి ప్రోత్సాహం లభించడం ఎంతో సంతోషం. ప్రతి ఒక్కరూ ప్రకృతి రక్షణకు తమవంతు కృషి చేయాలి. అప్పుడే ప్రకృతి బాగుంటుందని నమ్ముతాను.



వినదగునెవ్వరు చెప్పిన.. అజ్ఞాత శ్రీమంతుడి పాఠాలు!

నగరం గురించి ఏ మాత్రం తెలియని ఒక కుర్రాడు నెల రోజుల్లో నాలుగు ఉద్యోగాలు సంపాదించగలిగాడు. తను చదివిన చదువుకు తగ్గ కొలువా? నచ్చిన ఉద్యోగమా అని చూడలేదు. చేతిలో రూ.500 మాత్రమే ఉన్నాయి.. నెలరోజులు ఊరు కానీ ఊరులో బతకాలి. శ్రీమంతుల కుటుంబం నుంచి వచ్చినా తమ కుటుంబ కట్టుబాట్ల మేరకు గుర్తింపును వెల్లడించకూడదు. ఇటువంటి పరిస్థితుల్లో గుజరాత్ నగల వ్యాపారి కుటుంబం నుంచి వచ్చిన హితార్థ్ ఘన్‌శ్యాం డోలాకియా తను అనుకున్నది సాధించాడు. నెల రోజుల ప్రయాణంలో మనకు ఎన్నో పాఠాలను చెప్పకనే చెప్పి వెళ్లాడు.

– ఈనాడు, హైదరాబాద్




హితార్థ్

ఖాళీగా ఉండొద్దు..



నగరంలో చాలామంది కుర్రకారు ఉద్యోగాలు దొరక్క ఖాళీగా ఉంటున్నారు. నచ్చిన కొలువు వచ్చేదాక ఎదురుచూసే వారు మరికొందరు. ఖాళీగా కుటుంబానికి భారమవుతున్నామనే దిగులు ఉన్నా.. అడుగు ముందుకు పడక సతమతమయ్యే వారు ఎందరో. ఖాళీగా ఉండకుండా మొదట దొరికిన ఉద్యోగంలో చేరాలి. అక్కడి అనుభవం.. పరిచయాలు కోరుకున్న కొలువుకు బాటలు పడేలా చూసుకోవాలి. నచ్చకపోతే మనసు చంపుకుని పనిచేయాల్సిన పనిలేదు. మరో ఉద్యోగంలో చేరొచ్చు.

మౌనం వీడాలి



చిన్న కుటుంబాలు.. బడి, కళాశాల తప్ప మరో ప్రపంచం తెలియని చాలా మంది కుర్రాళ్లు చదువులో ముందుంటే ఫర్వాలేదు. ప్రాంగణ నియామాల్లోనే కొలువులు దొరుకుతాయి. అందరూ చదువుల్లో చురుగ్గా ఉండకపోవచ్చు కదా! బయట ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నప్పుడు ఎక్కువ మందితో మాటలు కలపాలి. పరిచయాలు పెంచుకోవాలి. ఆటోడ్రైవర్, క్యాబ్‌డ్రైవర్, టీకొట్టు ఇలా ఎవరైనా కావొచ్చు. సమాచారం కోసం వారిని సంప్రదించడంలో తేలికభావం వద్దు. గుజరాత్ కుర్రాడికి సలహా ఇచ్చింది ఓ ఆటోవాలా.

నైపుణ్యాలు మెరుగు



ఉద్యోగాలకు కావాల్సింది కమ్యూనికేషన్ స్కిల్స్. ఈ రోజుల్లో భాషానైపుణ్యాలు చాలాముఖ్యమని ఇప్పటికే ఉద్యోగవేటలో ఉన్నవారికి అనుభవంలోకి వచ్చి ఉంటుంది. డిగ్రీలు లేకపోయినా.. చేతిలో సర్టిఫికెట్లు లేకపోయినా నైపుణ్యం ఉంటే సిటీలో కొలువు సంపాదించడం పెద్ద కష్టమేమి కాదని మరోసారి నిరూపితం అయ్యింది. గుజరాత్ కుర్రాడు హిందీ, ఇంగ్లీష్ బాగా మాట్లాడటంతో కొలువు సంపాదించడానికి ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరం రాలేదు.



ప్రయత్నం ఆపొద్దు

కొన్నాళ్లు ప్రయత్నించాక ఉద్యోగం దొరకలేదని నిరుత్సాహ పడి కొలువుల వేట మానేస్తారు. ప్రయత్నం ఆపొద్దు అనేది గుజరాత్ కుర్రాడు నేర్పిన పాఠం. ఊరు నుంచి నగరానికి వచ్చాక సిటీలో రెండురోజు జాలీగా గడిపాక.. ఇలా వాయిదాలు వేయకుండా తొలిరోజు నుంచే ప్రయత్నం మొదలెట్టాలి. మీ ప్రయత్నాన్ని చూసి ఇతరులు చేయూతనిచ్చే అవకాశం ఉంది.



ఉన్న చోటు నుంచి..

ఉద్యోగ వేటలో ఉన్న చోటనే అంటే కొన్నిసార్లు దొరకపోవచ్చు.. అవసరమైతే ఊరు వదిలి.. నగరం దాటి వెళ్లడానికి సిద్ధపడాలి. సొంత నగరంలో చిన్న ఉద్యోగాలంటే నామోషిగా భావిస్తుంటారు. అడ్డంకుల్ని తెలియని ప్రాంతంలో అధిగమించవచ్చు. అక్కడి భాష నేర్చుకోవడం వంటి కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవచ్చు. హైటెక్‌సిటీలో ఉద్యోగాల కోసం నాగోల్‌లో ఉండి ప్రయత్నించే బదులు.. మణికొండలో ఉంటే ప్రయాణభారం తగ్గుతుంది. అమీర్‌పేటలో ఉంటే ఐటీ రంగంలో పోకడలు.. ఏ విభాగంలో ఉద్యోగాలు ఉన్నాయనే విషయాలు సులభంగా తెలుస్తాయి. ఇక్కడే అద్దె గదుల్లో, హాస్టల్‌లో ఉంటున్నప్పుడు ప్రాంతం మారడానికి కూడా సిద్ధపడక వెనకబడి పోతుంటారు.



గుర్తుంచుకోవాలి

ప్రతి దశలో ఎవరో ఒకరు ఏదో రూపంలో సాయపడుతూనే ఉంటారు. ప్రతిఫలం ఆశించకుండా చూసే వారే ఎక్కువ శాతం ఉంటారు. సమాజంలో మంచి ఇంకా బతికే ఉందని వీరు గుర్తు చేస్తుంటారు. ఇది మున్ముందు కొనసాగాలంటే ఇలాంటి వ్యక్తులను మర్చిపోకుండా.. ఉన్నతస్థానంలో ఉన్నప్పుడు అవసరమైన వారికి మీకు తోచిన రూపంలో సాయం చేయడానికి ప్రయత్నించాలి.





అమీర్‌పేట ప్రధాన రహదారిలో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు ఎండిపోయాయి. అక్కడే మరోచోట రహదారికి అడ్డంగా విభాగినుల వద్ద ప్రయాణాలు సాఫీగా సాగకుండా పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. నిర్వహణలో లోపాల వల్ల అవసరమైన చోట లేకుండా.. అనవసరమైన చోట పెరుగుతున్నాయి.

మారాలి.. మారి తీరాలి

ఏటా రూ.70 కోట్లకు పైగానే జరిమానాలు ● పాయింట్ల నేపథ్యంలో మార్పు అవశ్యం

ఈనాడు, హైదరాబాద్

శిరస్త్రాణం ధరించకుండా వాహనం నడిపినందుకో.. ఎర్రలైటు పడినా సిగ్నల్ జంపింగ్ చేసినందుకో.. మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికినందుకో.. ఇలా ఉల్లంఘన ఏదైనా కానీ రాజధాని నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వాహనదారులు ప్రతి రోజు చెల్లిస్తున్న సగటు జరిమానా ఎంతో తెలుసా..? దాదాపు రూ.9లక్షల పైమాటే. ఈలెక్కన ఏటా సుమారు రూ.70 కోట్లకుపైగానే జరిమానాల రూపంలో ఉల్లంఘనుల జేబుల్లో నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ అవుతోంది. ప్రస్తుతం పాయింట్ల నమోదుతో జరిమానాలకు తోడు అవీ తోడైతే లైసెన్స్ పైనే ప్రభావం చూపనుంది. ఈనేపథ్యంలో వాహనదారులు మారి తీరాల్సిన అవసరం ఏర్పడింది.

మోటారు వాహనాల చట్టం నిబంధనల్ని ఉల్లంఘించే వాహనదారులపై దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో మాత్రమే పాయింట్ల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానం కేంద్ర మోటారు వాహనాల చట్టంలోనే ఉన్నా దేశంలో ఇంకా ఎక్కడా అమల్లో లేదు. తొలిసారిగా తెలంగాణాలో.. అదీ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోనే ఈనెల నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జరిమానాలకు తోడు లైసెన్స్‌దారులపై పాయింట్లను నమోదు చేస్తున్నారు. రెండేళ్లలో 12 పాయింట్లు నమోదైతే లైసెన్స్ రద్దు చేసే సన్నాహాల్లో ట్రాఫిక్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటివరకు ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలు చెల్లించి బయటపడే పరిస్థితి ఉండేది. ఇకపై కూడా అలా బయటపడతామనుకుంటే కుదరదు. మొదటికే మోసం రావొచ్చు. ఉల్లంఘనలు హద్దు మీరితే మీరు వాహనం నడిపే అవకాశముండదు. అయినా సరే అని మొండికేస్తే ఊచలు లెక్కించడం ఖాయం. అందుకే వాహనాన్ని రోడ్డు పైకి తీసుకొచ్చే ముందే తగిన స్పృహ ఉండాలి.

ప్రస్తుతమైతే రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కితేనే..

ప్రస్తుతం ఈ మూడు కమిషనరేట్ల పరిధిలో కాంటాక్టు, నాన్‌కాంటాక్టు పద్ధతిలో జరిమానాలు విధిస్తున్నారు. ఉల్లంఘనుల్ని గుర్తించినప్పుడు రహదారులపైనే ఆపి జరిమానా విధించడాన్ని కాంటాక్ట్ చలానాగా.. వాహనదారుడిని ఆపకుండానే ట్రాఫిక్ సిబ్బంది చేతిలోని కెమెరానో లేక కూడళ్లు, ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలు చిత్రీకరించే ఉల్లంఘనల్ని కంట్రోల్ రూంలోని సిబ్బంది సంగ్రహించడం ద్వారానో జరిమానా విధించడాన్ని నాన్ కాంటాక్ట్ చలానాగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పాయింట్ల విధానం అమలైన తర్వాత ఈ రెండు విధాలా జరిమానాలు యథావిధిగానే ఉండనున్నాయి. వీటికితోడు ఉల్లంఘనుల్ని గుర్తించి వారి లైసెన్స్‌లపై పాయింట్లను



నమోదు చేస్తున్నారు. ఇప్పటికైతే కేవలం వాహన తనిఖీల సమయంలో గుర్తించిన ఉల్లంఘనులపై మాత్రమే పాయింట్లను నమోదు చేస్తున్నారు. ఎందుకంటే.. పాయింట్లను నమోదు చేసేది వాహనదారుడి లైసెన్స్ పైనే కాబట్టి అలా చేస్తున్నారు. ఉల్లంఘనకు పాల్పడిన వాహనదారుడిని గుర్తించినప్పుడు మాత్రమే అతడి లైసెన్స్‌పై పాయింట్లు నమోదు చేసే అవకాశముంది. ఒకవేళ ఒకరి వాహనాన్ని మరొకరు తీసుకెళ్లి ఉల్లంఘనకు పాల్పడితే.. ప్రత్యక్షంగా అతడిని గుర్తించకుండా లైసెన్స్‌పై పాయింట్లను నమోదు చేయడం సరికాదు కాబట్టి ఇలా చేస్తున్నారు. కానీ సమీప భవిష్యత్తులో నాన్‌కాంటాక్ట్ పద్ధతిలోనూ పాయింట్లను నమోదు చేసే అవకాశముండటంతో ఇప్పటినుంచే వాహనదారులు జాగ్రత్త పడటం అలవాటు చేసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలు ఇలా..

నగర కమిషనరేట్ పరిధిలో ఇదీ పరిస్థితి..

ఏడాది	కేసులు	జరిమానాలు
2014	30,47,169	రూ. 35,75,46,610
2015	30,23,086	రూ. 32,25,45,023
2016	30,87,499	రూ. 31,02,61,375
2017 జూన్ వరకు	13,46,248	రూ. 10,98,55,915

సైబరాబాద్, రాచకొండ పరిధిలో..

కమిషనరేట్	కేసులు	జరిమానా
సైబరాబాద్	12,40,027	రూ. 28,65,81,355
రాచకొండ	2,61,643	రూ.10,23,79,750

(గత ఏడాది గణాంకాలు మాత్రమే)

చిన్న వయస్సుకి పొదుపు పాఠాలు!



చిన్నప్పటి నుంచి పిల్లలు అడిగిందల్లా కొని ఇవ్వడం వారి భవిష్యత్తుకే ముప్పుగా మారుతోంది. దాని ధరతో సంబంధం లేకుండా చాలామంది పిల్లలు వారికి నచ్చిన వస్తువునల్లా కొనిమ్మని తల్లిదండ్రులను పట్టుపడుతుంటారు. వాటి అవసరం ఏమేరకు ఉందో లెక్కించకుండా పిల్లలు అడిగారని చాలా మంది తల్లిదండ్రులు కొనేయడం పరిపాటిగా మారింది. దీనితో పిల్లలు పెడదారి పట్టడానికి ఎక్కువ ఆస్కారం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. పిల్లలు చిన్నచిన్న కష్టాలు ఎదుర్కొనేలా చేయాలని వారు వివరిస్తున్నారు. చాలామంది పిల్లలకు పొదుపు అనేదే తెలియట్లేదని, చిన్నవయస్సు నుంచే ఆ పాఠాలు నేర్పితే భవిష్యత్తులో వారికి అది మంచి అలవాటు అవుతుందని వారు వెల్లడిస్తున్నారు.



- **అడిగిందల్లా ఇవ్వడం మంచిది కాదు**
- **వద్దన్నా వినేలా తర్ఫీదు ఇవ్వాలి**
- **చిన్న చిన్న కష్టాలు ఎదుర్కొనేలా చేయాలి**

ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్ మహా నగరానికి విద్య, ఉద్యోగరీత్యా వస్తున్న వారే ఎక్కువ. ఉదయం నుంచి రాత్రివరకు విధుల్లో పూర్తిగా నిమగ్నమవ్వడం.. ఇంటికి రావడంతో అలసిపోయి పిల్లల గురించి పట్టించుకోకుండా ఉండేవారే నగరంలో ఎక్కువగా ఉంటున్నారు. కొందరు మాత్రం ఏ కొద్ది సమయం ఖాళీగా ఉన్నా కుటుంబసభ్యులతో గడుపుతున్నారు. పిల్లలు అడిగిందల్లా కొనిఇవ్వడంలో మాత్రం ఆచితూచి చూసేవారు తక్కువే. ఒకరిని చూసి మరొకరు వస్తువు ధరతో సంబంధం లేకుండా కొని ఇచ్చే అలవాటు పిల్లలకు చేసేస్తున్నారు. ఇదే వారికి ముప్పు తీసుకొస్తోంది. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో పిల్లల పేరున పొదుపు ఖాతా తెరచి వారికి పొదుపు చేయడం అలవాటు చేయాలని నిపుణులు వివరిస్తున్నారు. ప్రోత్సాహకంగా ఇచ్చిన నగదుని పిల్లలు పొదుపు చేసే విధానం అలవాటుగా మార్చాలని వారు పేర్కొంటున్నారు.

చిన్న వయస్సులోనే బైకులు.. ముప్పు

నిండా పదేళ్లు పూర్తి కాకుండానే పిల్లలకు ద్విచక్ర వాహనాలు కొని ఇచ్చేస్తున్నారు. వారికి లైసెన్స్ లేకుండానే సందుల్లో తొక్కుకుంటాడు అంటూ తల్లిదండ్రులు వత్తాసు పలుకుతున్నారు. అలా మొదలైన వారి ప్రయాణం ఏదో ఒకచోట దుర్ఘటనలకు దారితీస్తోంది. నగరంలో చాలామంది విద్యార్థులు ఈ తరహా ప్రమాదాలకు గురవుతున్నారు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు నచ్చిన వాహనాలు కొని ఇచ్చేస్తున్నారు. ఇటీవల పలు ప్రమాదాలకు మైనర్లే కారణమవుతున్నట్లు పోలీసుల గణాంకాలు వివరిస్తున్నాయి.

పిల్లల చేతుల్లో ఖరీదైన చరవాణులు.. వద్దు

ఏమాత్రం ఖాళీ దొరికినా పిల్లలు చరవాణులతోనే ఆడుకుంటున్నారు. వీరు వినియోగించేవి అత్యంత ఖరీదైనవి కావడం విశేషం. చిన్నపిల్లలు ఏడిస్తే కూడా చరవాణిలో పాటలు పెట్టడం లేదా ఆటలాడుకొనేలా ప్రోత్సహించడం చాలామంది తల్లిదండ్రులు అలవాటు చేసేస్తున్నారు. పిల్లలను సంరక్షణ కేంద్రాల్లో రోజంతా ఉంచి.. సాయంత్రం వారిని ఇళ్లకు తీసుకొచ్చింది మొదలు 70శాతం మహిళలు వారికి చరవాణులు ఇస్తున్నట్లు ఇటీవల నగరంలో ఒక సర్వేలో తేలింది. పిల్లలకు ఆట వస్తువులు ఇవ్వకుండా చరవాణులే ఇవ్వడంతో వారికి వచ్చే ఇబ్బందుల గురించి తెలియకే ఇలా చేస్తున్నామని 40శాతం మంది మహిళలు తెలిపారు.



ట్యాబ్‌లలోనే పాఠాలు..?

నగరంలో చాలా ప్రైవేటు పాఠశాలలు హైటెక్ హంగులను ప్రదర్శిస్తున్నాయి. మూడు, నాలుగో తరగతుల్లో పిల్లలకు ట్యాబ్‌లను అలవాటు చేస్తున్నాయి. మా పాఠశాలలో హోమ్‌వర్కు ట్యాబ్‌ల్లోనే చేయాల్సి ఉంటుందని యాజమాన్యాలు వివరిస్తున్నాయి. దీంతో చిన్నవయస్సులోనే చరవాణులకు పిల్లలు అలవాటుపడిపోతున్నారు. అదే అలవాటుగా మారి పర్యవేక్షణ లేక ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉండే నీలిచిత్రాలు, బొమ్మలు వారిపై ప్రభావం చూపి పెడదారి పట్టే ప్రమాదం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. చదువుపై శ్రద్ధ తగ్గే ప్రమాదం ఉందంటున్నారు.



మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే..: సుధీర్‌కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

నగరంలో చాలామంది తల్లిదండ్రులు.. తమ పిల్లలు అడిగిందల్లా కొనేస్తున్నారు. దాని విలువ, ఉపయోగం గురించి అవగాహన కల్పించకుండానే కోరికలు తీర్చేస్తున్నారు. కొనిపించుకున్న కొద్ది రోజులకే వాటిని పక్కన పడేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు మంచిగా ఉండాలంటే వారు చిన్న చిన్న కష్టాలు ఎదుర్కొనేలా చూడాలి. అడిగిందల్లా ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారనే విషయాన్ని గుర్తించాలి. చాలామంది పిల్లలు.. తమ స్నేహితులను చూసి కోరికలు పెంచుకుంటున్నారు. వాహనం, ఖరీదైన చరవాణి ఇలా పలు వస్తువులను కోరిన వెంటనే ఇవ్వడంతో వారి భవిష్యత్తుని తల్లిదండ్రులే అంధకారంలోకి నెట్టేస్తున్నారని గుర్తించాలి.

ఇలా చేస్తే మేలు..

- పుస్తకాలు, కథలు, పత్రికలు చదివించడం అలవాటు చేయాలి.



- ఇతర పిల్లలతో కలిసి ఆడుకునే వీలుంటే అందుకు కొంత సమయం కేటాయించాలి.



- పొదుపు పాఠాలు నేర్పాలి. వారిని ప్రోత్సహించేందుకు ఇచ్చే ప్రతి రూపాయి దాచుకొనే అలవాటు చేయాలి. వాటితోనే వారికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయించాలి.



- చిన్న వయస్సు వారికి వాహనాలు కొని ఇవ్వడం మంచిది కాదు.
- ఇంట్లో చేసే పనుల్లో చిన్నచిన్నవి వారికి అప్పగించాలి. దగ్గరలోని దుకాణాలకు వారిని పంపించి కొనడం అలవాటు చేయాలి.
- చరవాణులు, కంప్యూటర్లకు పిల్లలను సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచితే మంచిది.



కోరి వస్తోన్న కొలువు.. రారమ్మంటోన్న చదువు

మాదాపూర్ న్యూస్‌టుడే

కళాశాల చదువు ముగుస్తుందో.. లేదో.. తెలియగానే యువత ఉద్యోగాల కోసం వెతుకుతుంటారు. ప్రాంగణ నియామకాలు.. నేరుగా దరఖాస్తు చేయడం.. ఇలా ఏ అవకాశాన్ని వదలరు. చదువు ముగిసేలోగానే కొలువును కోరుకుంటుంటారు.. అయితే.. ఇటీవల నగర యువత ఆలోచనలో మార్పు కనిపిస్తోంది..

డిగ్రీ పూర్తికాగానే ఏదైనా మంచి కంపెనీలో ఉద్యోగం చేయాలి.. పట్టా చేతికి రాగానే బహుళజాతి కంపెనీలో చేరిపోవాలి.. ప్రాంగణ నియామకాల్లో కొలువు వెతుక్కుంటూ వస్తే ఎగిరి గంతెయ్యాలి.. అనుకునే విద్యార్థులు తగ్గుతున్నారు. ప్రస్తుతం చాలా మంది డిగ్రీతో వచ్చే ఉద్యోగాలపై ఆసక్తి చూపడం లేదు. ఉన్నత చదువులకు వెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఏడాదికి రూ. 15 నుంచి 20 లక్షల వేతనాల జాబ్ ఆఫర్లను కూడా కాదనుకొని తమకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు పోటీపడుతున్నారు. తాము ఎంచుకున్న కోర్సులో పూర్తిస్థాయి పట్టుసాధించాలనే తపనతో ఉన్నత చదువులకు వెళ్తున్నారు. ట్రిపుల్‌ఐటీ, ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా మెరుగైన భవిష్యతుకు బాటలు వేసుకుంటున్నారు. కొందరైతే కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వచ్చిన ఉద్యోగం వదులుకోక కొన్నాళ్లపాటు అక్కడి పనిచేస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక ఉద్యోగం మానుకొని ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్నారు. డిగ్రీ స్థాయిలో పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంటున్న యువత ఆయా రంగాల్లో మరింత జ్ఞానం పెంచుకునేందుకే ఉన్నత చదువుల వైపు మొగ్గుచూపుతున్నారు.

బోధనపై ఎక్కువ ఆసక్తి

ఉన్నత చదువులకు వెళ్తున్న యువతలో అధిక శాతం బోధన రంగంలో స్థిరపడేందుకు ఇష్టపడుతున్నారు. పీజీ, పీహెచ్‌డీ చేశాక మంచి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నారు. తాము నేర్చుకున్న విద్యను, జ్ఞానాన్ని నలుగురికి పంచాలనుకుంటున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ.. ఇలా ఉన్నత చదువులకు క్యాంపస్‌లో దాదాపు పదేళ్లు గడుపుతున్న యువత చదువులయ్యాక అక్కడే అధ్యాపకులుగా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. పై చదువులపై తమ పిల్లలు చూపుతున్న ఆసక్తిని తల్లిదండ్రులు ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఆలోచనలకు 'అంకుర'ం

సాంకేతిక విద్యార్థులు మాత్రం డిగ్రీస్థాయిలో పరిశోధనల వైపు దృష్టిసారిస్తున్నారు. డిగ్రీ పూర్తికాగానే సమాలోచనలు జరిపి తోటి స్నేహితులతో కలిసి అంకుర సంస్థల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా కంప్యూర్‌సైన్స్ రంగంలో ఉన్న యువత సరికొత్త మొబైల్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకవచ్చేందుకు అంకిత భావంతో కష్టపడుతున్నారు. ఇలా విద్యార్థులు డిగ్రీ అయ్యాక ఉద్యోగంలో చేరడం కంటే ఉన్నత చదువులు లేదా సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనే ఆశయంతో ఉంటున్నారు.

బోధన రంగంలో ఆసక్తి: సౌజన్య పొన్నపల్లి, బీటెక్, ట్రిపుల్‌ఐటీ




ట్రిపుల్‌ఐటీలో పరిశోధనలు, అకడమిక్స్ రెండింటికి ప్రాధాన్యం ఇస్తారు. ప్రాంగణ నియామకాల్లో నాకు ఓ బహుళ జాతి కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ. 22 లక్షల వేతనం. బోధనపై ఆసక్తి ఉండటంతో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఎంఎస్, పీహెచ్‌డీ సీటు వచ్చింది.

అమెరికాలో ఉన్నత చదువులు: ప్రియదర్శిరథ్, ట్రిపుల్‌ఐటీ



మాది జార్ఖండ్. అమ్మనాన్న వైద్యులు. బయాలజీ సబ్జెక్టుపై ఆసక్తి లేకపోవడంతో కంప్యూటర్‌సైన్స్ వైపు వచ్చాను. మా తల్లిదండ్రులు నాకు ఇష్టమైన కోర్సును ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఇచ్చారు. ఇష్టపడి చదవటంతో నేను బీటెక్ ఈసీఈలో బంగారు పతకం సాధించగలిగాను. అమెరికాలోని ఓ ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ సీటు వచ్చింది.

ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ చేస్తా: కౌత్సవ్‌సేన్‌గుప్తా, ట్రిపుల్‌ఐటీ



ఎంటెక్ సీఏఎస్ఈ కోర్సు చేశాను. బంగారు పతకం సాధించా. ఇది నాకు రెట్టింపు ఉత్సాహాన్ని ని చ్చింది. ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ సీటు వచ్చింది. పీహెచ్‌డీ అయ్యాక విద్యాబోధన చేయాలని ఉంది. మా స్వస్థలం కోల్‌కత్తా. నాన్న విశ్రాంతి ఉద్యోగి. అమ్మ గృహిణి. డిగ్రీలో చేరిన ఏడాది నుంచి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితం వస్తుంది.







నంబరు దాచిపెట్టు... చలానాకు మస్కా కొట్టు..

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా కేసులు బుక్ చేయడంతో పాటు... పాయింట్లు విధిస్తుండటంతో వాహన చోదకులు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. వాహనాలపై నంబర్లను కనిపించకుండా చేయడమో... ఏదో ఒక అక్షరాన్ని చెరిపివేయడమో చేస్తున్నారు.



ప్రతిభ

ముఖ్యమైన తేదీలు

★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: *9 సెప్టెంబరు*
★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: *12 సెప్టెంబరు*
★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: *15 సెప్టెంబరు*

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

టీఎస్‌పీఎస్‌సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857
వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.16,400 - 49,870
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.

★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.

పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.

పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.

★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

★ మొత్తం ఖాళీలు: 205.
★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్తీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
  ✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
  ✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 90
★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్రీ/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.

పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.

పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.

★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 67.
★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

★ మొత్తం ఖాళీలు: - 65
★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.(మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు Jobs

★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 43.
★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.

పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.

★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 10.
★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.

పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.

★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

★ మొత్తం ఖాళీలు: 6
★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిస్ట్
★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.

పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.

★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

★ ఖాళీలు: 2
★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.17,890 - 53,950
★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.

పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.

పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.

★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.tspsc.gov.in**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
✪ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఛైర్ - 1.
✪ జువాలజీ - 1.
✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
✪ మ్యాథమెటిక్స్ - 1.
✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.

చివరి తేదీ: 9 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.anu.ac.in**

బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000

చివరి తేదీ: *29 ఆగస్టు*

✪ వెబ్‌సైట్: **www.brau.edu.in**

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయనుంది.

✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) - 1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.

వెబ్‌సైట్: **www.iimv.ac.in**

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):



37. I. ✔ II. ✔

Both I and II follows.


38. I. ✔ II. ✕

Only I follows.

39. I. ✕ II. ✕

Neither I nor II follows.

40.



I. ✕ II. ✔

Only II follows.

41. 8×20 men = 8×32 women

$\Rightarrow$ 5 men = 8 women

5 men + 8 women = 16 women

$M_1D_1 = M_2 D_2$

$\Rightarrow 8 \times 32 = 16 \times D_2$

$\Rightarrow D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square

$= \sqrt{1024} = 32$ cm.

$\therefore$ Length of rectangle

$= 2 \times 32 = 64$ cm.

Breadth of rectangle = 32 – 12 = 20 cm.

$\therefore$ Required ratio = 64 : 20 = 16 : 5

43. x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220

$\Rightarrow 5x + 20 = 220 \Rightarrow x = 40$

Second lowest number of different set

$= 2 \times 40 - 37 = 43$

$\therefore$ Required sum

= 42 + 43 + 44 + 45 + 46 = 220

44. Bus fare = Rs. 420

Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630

$\therefore$ Required total fare

= Rs. $(2 \times 420 + 4 \times 630)$ = Rs. (840 + 2520)

= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph

Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph

$\therefore$ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph

$\therefore$ Average speed of car and jeep together

$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings

$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen

= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday

= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160

= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006

$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference

$= (14.5 - 6.6) \times 1000$ = Rs. 7900

54. Total monthly rent at Virar over the years

$= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) \times 1000$

= Rs. 21900

$\therefore$ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. **I.** $5x^2 - 18x + 9 = 0$

$\Rightarrow 5x^2 - 15x - 3x + 9 = 0$

$\Rightarrow 5x(x - 3) - 3(x - 3) = 0$

$\Rightarrow (x - 3)(5x - 3) = 0$

$\therefore x = 3$ or $\frac{3}{5}$

II. $20y^2 - 13y + 2 = 0$

$\Rightarrow 20y^2 - 8y - 5y + 2 = 0$

$\Rightarrow 4y(5y - 2) - 1(5y - 2) = 0$

$\Rightarrow (4y - 1)(5y - 2) = 0$

$\therefore y = \frac{1}{4}$ or $\frac{2}{5}$

Clearly, x > y

57. **I.** $x^3 = 878 + 453 = 1331$

$\therefore x = \sqrt[3]{1331} = 11$

II. $y^2 = 82 + 39 = 121$

$\therefore y = \sqrt{121} = \pm 11$

$\therefore x \geq y$

58. **I.** $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$

$\Rightarrow 3 + 4 = x \Rightarrow x = 7$

II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$

$\Rightarrow y^{7/2} = 7^{7/2} \Rightarrow y = 7$

$\therefore x = y$

59. **I.** 9x – 4x = 54.55 + 15.45

$\Rightarrow 5x = 70 \Rightarrow x = 14$

II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$

$\Rightarrow y + 155 = 169$

$\Rightarrow y = 169 - 155 = 14$

$\therefore x = y$

60. **I.** $x^2 + 11x + 30 = 0$

$\Rightarrow x^2 + 6x + 5x + 30 = 0$

$\Rightarrow x(x + 6) + 5(x + 6) = 0$

$\Rightarrow (x + 5)(x + 6) = 0$

$\therefore x = -5$ or -6

II. $y^2 + 7y + 12 = 0$

$\Rightarrow y^2 + 4y + 3y + 12 = 0$

$\Rightarrow y(y + 4) + 3(y + 4) = 0$

$\Rightarrow (y + 3)(y + 4) = 0$

$\therefore y = -3$ or -4

Clearly, x < y

61. The pattern of the number series is :

$7 \times 2 + 6 = 20$; $20 \times 2 + 6 = 46$

$46 \times 2 + 6 = 98$

$98 \times 2 + 6 = 202$

$202 \times 2 + 6 = 404 + 6 =$ 410

Send your feedback to

pratibhadesk@eenadu.net

62. The pattern of the number series is :

$210 - 1^3 = 209$

$209 + 2^2 = 213$

$213 - 3^3 = 186$

$186 + 4^2 = 202$

$202 - 5^3 = 202 - 125 =$ 77

63. (5) The pattern of the number series is :

27 + 11 = 38

38 + 33 = 71

71 + 55 = 126

126 + 77 = 203

203 + 99 = 302

64. (3) The pattern of the number series is :

$435 - 9 \times 9 = 354$

$354 - 9 \times 8 = 282$

$282 - 9 \times 7 = 219$

$219 - 9 \times 6 = 165$

$165 - 9 \times 5 =$ 120

65. (3) The pattern of the number series is :

$4 + 14^2 = 4 + 196 = 200$

$200 + 13^2 = 200 + 169 = 369$

$369 + 12^2 = 369 + 144 = 513$

$513 + 11^2 = 513 + 121 = 634$

$634 + 10^2 = 634 + 100 =$ 734

Calculations (66 – 70):

$\therefore$ 25% = 75

$\therefore$ 100% $= \frac{75}{25} \times 100 = 300$

$\therefore$ Total females = 300

Computer Science $\Rightarrow \frac{300 \times 35}{100} = 105$

Civil Engineering $\Rightarrow \frac{300 \times 5}{100} = 15$

Electrical Engineering $\Rightarrow \frac{300 \times 20}{100} = 60$

Mechanical Engineering $\Rightarrow \frac{300 \times 15}{100} = 45$

Bio-technology = 75

Total males = 700 – 300 = 400

Computer Science $\Rightarrow \frac{400 \times 30}{100} = 120$

Civil Engineering $\Rightarrow \frac{400 \times 15}{100} = 60$

Electrical Engineering $\Rightarrow \frac{400 \times 18}{100} = 72$

Mechanical Engineering $\Rightarrow \frac{400 \times 12}{100} = 48$

Bio-technology $= 400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$

$= \frac{100}{3} = 33\frac{1}{3}\%$

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference

= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :

Total students = 105 + 15 + 120 + 60 = 300

Male students = 180

$\therefore$ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average

$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019

$\therefore$ Required answer = 1020

72. ? $= \frac{150 \times 150}{100} + 150$

= 225 + 150 = 375

73. ? $= \frac{300 \times 750}{1000} - 1400$

= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38

$\therefore$ Required answer = 40

75. ? $= \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$

$\therefore$ Required answer = 110

76. C.P. of wrist watch

$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.

= Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200

$\therefore$ Required S.P. of wrist watch =

Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$

= Rs. 4000

77. Fifth number

$= 5 \times 56 - 4 \times 54 = 280 - 216 = 64$

78. Let the number be x.

$\therefore x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$

$\Rightarrow x + 245 = 325$

$\Rightarrow x = 325 - 245 = 80$

79. x + 4x + 5x + 60 = 360"

$\Rightarrow 10x = 300° \Rightarrow x = 30$

$\therefore$ Required difference = 5x – x

$= 4x = 4 \times 30 = 120"$

80. On dividing 1740 by 88,

the remainder = 68

$\therefore$ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కింది పోస్టులను భర్తీ చేయనుంది.

- ఖాళీలు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూక్లియర్) - 1.
- జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) - 1.
- డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) - 1.
- పర్చేజ్ మేనేజర్ - 3.
- ఈసీఐఎల్ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది. వీటిని బధిరులకు కేటాయించారు.
- సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ - 1
- అకౌంట్స్ ఆఫీసర్ - 2.
- పర్సనల్ ఆఫీసర్ - 2.
- ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✪ చివరి తేదీ: *31 ఆగస్టు*

వెబ్‌సైట్: **careers.ecil.co.in**

హాయ్! బుజ్జీ!!



మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం

– ఎమర్సన్


పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- push = తోయు
- మకరం = మొసలి

కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!

ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని టక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.



- మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.
- అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.
- ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.
- ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చుట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.
- ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.
- ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.
- దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.



ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

కథ

నోటు పాట్లు!

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.


ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

"ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపిరాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది". అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.



నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎందరివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.

'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

– గుడిపూడి రాధికారాణి

నవ్వుల జల్లులు!

టీచర్: హోంవర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

– జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి

భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..

భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!

– అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?


1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం

చిలిపి ప్రశ్న

రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

– ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక
చిరుత ఉరక

– ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

ఏది భిన్నం?



జవాబులు: చిలిపి ప్రశ్న: కలగన్నప్పుడు! ఏది భిన్నం: C జతపరచండి: 1.సి 2.డి 3.బి 4.ఎ ఎవరు నేను: Problem

త్వరలో కార్మికుల భారీ సమావేశం

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలో 54 రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరితో కలిసి త్వరలో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కె.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు సమావేశం నిర్వహించాలనే విషయాన్ని భారతీయ మజ్దూర్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు వి.చంద్రశేఖర్‌యాదవ్ హైదరాబాద్‌లోని నేరెడ్‌మెట్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తేదీ, ప్రదేశాన్ని ఇంకా నిర్ణయించాల్సి ఉందని, సమావేశానికి కార్మికులను సమాయత్తం చేయాలని ఆదేశించారన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు పాల్గొంటారన్నారు.

సెప్టెంబరు ఒకటిన జిల్లా కేంద్రంలో బ్లాక్ డే

పూడూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఆయా శాఖల ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు కోరుతూ సెప్టెంబరు ఒకటిన విధులకు సామూహిక సెలవులు పెట్టి బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు హెచ్. శివకుమార్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డిలు తెలిపారు. మండల పరిధిలోని మన్నెగూడ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004 నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి కొత్త పింఛను విధానం అమలు చేస్తుండటంతో వారి కుటుంబాలకు ఆర్థికంగా ఆసరా లేకుండా పోయిందన్నారు. దీన్ని నిరసిస్తూ సెప్టెంబరు 1న అన్ని శాఖల ఉద్యోగులు సామూహిక సెలవులు పెట్టి జిల్లా కేంద్రంలో జరిగే నిరసనకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక నుంచి చేపట్టే నియామకాలతో పాటు పదోన్నతులు, బదిలీలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టాలని కోరారు. సర్వీసు రూల్స్ వచ్చి నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం అమలు చేయటం లేదని చెప్పారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టక పోవటంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. డీఎస్సీ ఇప్పుడు... అప్పుడు అంటూ ప్రభుత్వం ఏడు, ఎనిమిది సార్లు వాయిదా వేస్తూ మాటలతో మాయ చేస్తుందని దుయ్యబట్టారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు.., 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: జగన్మోహిని (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమ ఘుమలు 'చెనా బీట్‌రూట్ మసాలా', మీచేతి వంట 'పాలక్‌పకోడీ కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ', జస్ట్ ఎ మినిట్ 'క్యాబేజ్ శాండ్‌విచ్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్-2(రిపీట్), 05-30: ఆడాళ్ళా మజాకా: (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ.3:00, రా. 09:00)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ.09:30, మ.2:00, సా.04:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ.10:00, మ.2:30, రా. 9:30).
- ★ విహారి (మ.12:00, సా.6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ (మ.1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: మార్నింగ్ షో: అమ్మో బొమ్మ (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్ (సత్యరాజ్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫీ అండ్ ఆలూ పరోటా, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చల్ల ఉండలు & స్వీట్ పనియారం, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – మంగుళూర్ బన్స్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పాలక్ రాజ్మా కర్రీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందు క్యూసైన్) - గోవన్ కోకోనట్ కేక్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – పాలకాయలు, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - పొట్లకాయ వడ కర్రీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఆచారి రోస్టెడ్ చికెన్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – ఆహతీర్ తుకా హష్య & బోహేమనియన్ డ్రెస్సింగ్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - శెనగల బిళ్ళల కర్రీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – తెరియాకి చికెన్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ పకోడి, సా.5.15: స్నాక్స్ – టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: కడుపులో సునామీ... **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: కడుపులో సునామీ... 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 17-08-2017

SVBC TTD

ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 అష్టలక్ష్మి అనుగ్రహం శ్రీ మాచిరాజు కిరణ్, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం..

భక్తి TV

ఉదయం: 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీ వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 సాయిగీతామృతం, 06-00 సద్గురుస్తోత్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Zee తెలుగు

ఉదయం: 07-30 శుభమస్తు, 08-00 సినిమా: రెడీ, 11-00 కామెడీ ఖిలాడీలు (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడీ ఖిలాడీలు, 05-00 జైకృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తులసి.

maa

ఉదయం: 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దినఫలం - రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: నమో వెంకటేశ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 04-00 సినిమా: ఊహలు గుసగుసలాడే, **సాయంత్రం:** 05-30 ఓకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్ .

GEMINI

ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ముగ్గురు మొనగాళ్ళు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: పందెంకోడి, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు,10-00 సినిమా: శౌర్యం.

జొన్న సాగులో మెలకువలు



జొన్నను ఖరీఫ్ పంటగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విత్తుకోవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి హారిక తెలిపారు. నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు.

రకాలు: సి.ఎస్.హెచ్-5, 6, 9, 13, పి.ఎస్.హెచ్-1, ఎ.ఎస్.హెచ్-1, పి.ఎస్.వి-1, సి.ఎస్.వి-15, నంద్యాల తెల్లజొన్న 3, ఎన్.జె -2169, ఎ.జె-140 తీపిజొన్న రకాలు విత్తవచ్చు. 105 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 15-20 కింటాళ్ల దిగుబడి వస్తుంది. సి.ఎస్.హెచ్ 5, 6, 9, 13 రకాల్లో కంకి కండె ఆకారంలో ఉండి బూజు తెగులు తట్టుకొంటాయి. అంతర పంటలను వేసుకోవచ్చు. ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. చొప్ప ఎక్కువగా వస్తుంది. కాండం తొలుచు పురుగును కొంత వరకు నివారిస్తుంది. గింజ తెల్లగా ఉంటుంది.

విత్తనం: ఎకరాకు 4 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే ఎడం : వరుసల మధ్య 45 సెం.మీ, వరుసలో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరాన్ని విత్తేటప్పుడు, పంట మోకాలు ఎత్తు పెరిగినప్పుడు.. 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

నీటి యాజమాన్యం : తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్లరేగడి భూముల్లో 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. పంట పూత, గింజ పాలు పోసుకునే సమయంలో నీరు తప్పకపెట్టాలి.

అంతర పంటలు : జొన్న, కందిలను 2:1 నిష్పత్తిలో వేసుకోవచ్చు.

అంతరకృషి : విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన తదుపరి కలుపు నివారణకు.. ఎకరాకు కిలో పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 3 రోజుల్లోపు పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో 2, 4-డి ఎకరాకు 800 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్

కనకాంబరానికి పురుగుల బెడద



కనకాంబరంలో పురుగుల బెడద ఎక్కువని ఉద్యాన అధికారి ఎం.బబిత తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు.

నులి పురుగులు: ఇవి మొక్కల వేర్లకు రంధ్రాలు చేసి బుడిపెలను కలుగజేస్తాయి. దీని వల్ల వేర్లు నీటిని, పోషకాలను కావాల్సిన మేర మొక్కకు అందించలేవు. అందువల్ల ఆకులు ముడుచుకుని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారతాయి. పూల పరిమాణం తగ్గుతుంది. నులి పురుగులు చేసిన రంధ్రాల గుండా శిలీంధ్రాలు వేర్లలోకి చేరి ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలు ఎండిపోతాయి.

నివారణ చర్యగా నులిపురుగులున్న పొలంలో కనకాంబరం పూలసాగు చేపట్టే ముందు, సూర్యరశ్మీకరణ చేయాలి. నాటేముందు ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగు కిలోల ఫోరేట్ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లాలి. నులిపురుగులు సోకిన మొక్కల్ని పెరికి నాశనం చేయాలి. బంతి పూలతో పంటమార్పిడి చేస్తే నేలలో నులిపురుగుల సంఖ్య తగ్గుతుంది.

పిండినల్లి: లేత కొమ్మలు, ఆకులు, పూమొగ్గలపై తెల్లని పొర కప్పినట్టుగా ఉండే పురుగులు గుంపులుగా చేరి రసంపీల్చడంతో ఆకులు పసుపురంగుకు మారి మొక్కలు గిడసబారతాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని బూజు పెరుగుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక మొక్కల పెరుగుదల తగ్గుతుంది. నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని రెండుసార్లు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన నారు నాటడం లేదా సాగుచేసిన పొలంలో శిలీంధ్రాలు ఉండటం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ శిలీంధ్రానికి నులి పురుగులు తోడైనప్పుడు మొక్కలు తొందరగా ఎండిపోతాయి. ఆకులు ముందుగా కిందికి వాలుతాయి. తరువాత పసుపు రంగుకు మారి కొమ్మల చివర్లు కిందికి వంగుతాయి. మొదట వేర్ల చివర్ల వద్ద తర్వాత నేల మట్టం వద్ద కాండం కుళ్లిపోతుంది. దీన్ని కాండంకుళ్లు అంటారు. లీటరు నీటికి 3 గ్రా. కాంటాఫ్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ భూమి తడిచేలా పోసి ఎండు తెగులును నివారించవచ్చు.